www.quicktodaynews.com

# క్విక్ టుడే

QUICK TODAY DAILY

తెలుగు దిన పత్రిక

విలేకరులు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన క్విక్ టుడే తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను. అనుభవం కలిగిన వారికి మాత్రమే ప్రాధాన్యం. తగిన గౌరవ వేతనం ఇవ్వబడును.

వివరాలకు వెంటనే సంప్రదించగలరు 8886460073 8125972476 క్విక్ టుడే

PUBLISHED FROM : TELANGANA ANDHRAPRADESH | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 139 | బుధవారం, ఫిబ్రవరి 07 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8



## కృష్ణా ప్రాజెక్టుల కోసం

# మరో ఉద్యమం

- నల్లగొండ నుంచే మలి పోరాటం
- కేంద్రం చేతికి జుట్టు ఇచ్చిన కాంగ్రెస్
- మా నీళ్లు మాకే అని పోరాడిన చరిత్ర మనది
- 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ
- గతంలో మేము కేంద్రం ఒత్తిడికి తలొగ్గలే
- పోరాటాలు మాకు కొత్త కాదని హెచ్చరిక
- కృష్ణాపరివాహక ప్రాంతాల ప్రతినిధులతో కెసిఆర్ సమావేశం

**హైదరాబాద్,క్విక్ టుడే :** తెలంగాణ ప్రయోజనాలు కాపాడుకునేలా కృష్ణా ప్రాజెక్టుల కోసం పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు సిద్ధమయ్యారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలకు నష్టం వాటిల్లేలా.. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబికి అప్పగిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడునేందుకు.. ఈనెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంతకైనా పోరాడుతామని స్పష్టం చేశారు. నాడు ఉద్యమం నడిపించి తెలంగాణను సాధించి తెలంగాణ హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే.. నేడు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలది.. తెలంగాణ ఉద్యమ కారులదేనని కేసీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత వైఖరి కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 3లో...



## కాళేశ్వరంతో తెలంగాణ

# సర్వనాశనం


- కృష్ణా జలాలపై దమ్ముంటే చర్చకు రావాలి
- కెసిఆర్‌కు మంత్రి ఉత్తమ్ సవాల్

**హైదరాబాద్,క్విక్ టుడే :** కాళేశ్వరంతో తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం నాడు సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 14 స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు ఒక్క స్థానం కూడా రాదని చెప్పారు. నల్గొండలో సభ పెట్టడం కాదని.. కృష్ణా జలాలపై చర్చకు రావాలని

మిగతా 3లో...

## తెలంగాణ ప్రభుత్వం

# కీలక నిర్ణయం



- గ్రూప్-1 లో మరో 60 పోస్టుల పెంపు
- 563కు పెరిగిన పోస్టుల సంఖ్య

**హైదరాబాద్,క్విక్ టుడే :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్ 1లో పోస్టుల సంఖ్యను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 60 పోస్టులు అదనంగా పెంచింది. గతంలో 503 పోస్టులకు టీఎస్పీయస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా మరో 60 పోస్టులకు ఆమోదం తెలపడంతో ఆ సంఖ్య 563కు పెరిగింది. మొత్తం పోస్టులకు వీలైనంత త్వరలో నోటిఫికేషన్ ఇవ్వాలని తెలంగాణ సర్కార్ టీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీ చేసింది. కాగా గ్రూప్-1లో 19 విభాగాల్లో 503 పోస్టులను ఇంటర్వ్యూలు లేకుండానే భర్తీ చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రిలిమ్స్, మెయిన్స్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయాలని టీఎస్‌పీఎస్సీ అప్పట్లో నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేసి గతేడాది జూన్ 11న ప్రిలిమ్స్ రాత పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షకు దాదాపు 2.32లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే అనూహ్యంగా పేపర్ లీకేజీకి వ్యవహారం బయటపడటంతో పెద్ద ఎత్తున దుమారం రేగింది. గ్రూప్ 1తో సహా పలు పరీక్షల పేపర్లు రాత పరీక్షకు ముందే వివిధ వ్యక్తుల చేతుల్లోకి చేరినట్లు సీబీఐ ఆధారాలతో సహా నిరూపించింది. దీంతో గ్రూప్ 1తోపాటు పలు పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. ఆ తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు రెండో సారి గ్రూప్ 1 పరీక్షను టీఎస్పీయస్సీ నిర్వహించింది. ఆ పరీక్ష కూడా రద్దయిన విషయం తెలిసిందే. తాజాగా పెరిగిన పోస్టులతో కొత్తగా మరోమారు గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చి, సజావుగా పరీక్షలను నిర్వహించాలని యోచిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో

మిగతా 3లో...

## మూసీ రివర్ ఫ్రంట్

# ప్రాజెక్టు అభివృద్ధి

### సిఎం రేవంత్‌తో పలువురు కంపెనీ ప్రతినిధుల భేటీ





**హైదరాబాద్,క్విక్ టుడే :** హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలు కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఇటీవల లండన్, దుబాయ్ పర్యటనలో ముఖ్యమంత్రి అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను పరిశీలించారు. దుబాయ్ లో పలు విదేశీ కంపెనీలు, డిజైన్ ఎలానింగ్ ఆర్కిటెక్చర్ సంస్థల ప్రతినిధులు, కన్‌స్టలెన్సీ నిపుణులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తదుపరి సంప్రదింపుల్లో భాగంగా హైదరాబాద్ అర్బన్ డెవెలప్మెంట్ అథారిటీ, మూసీ డెవెలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు వివిధ కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు.

మిగతా 3లో...

## టీఎస్ ఈఏపీసెట్

# షెడ్యూలు విడుదల

- ఫిబ్రవరి 21న ఈఏపీసెట్ నోటిఫికేషన్
- 26 నుంచి ఏప్రిల్ 6 వరకు దరఖాస్తులు స్వీకరణ
- మే 9 నుంచి 12 వరకు పరీక్షలు



**హైదరాబాద్,క్విక్ టుడే :** తెలంగాణలో ఇంజినీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న ’టీఎస్ ఈఏపీసెట్ షెడ్యూలు విడుదలైంది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఫిబ్రవరి 21న ఈఏపీసెట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఫిబ్రవరి 26 నుంచి ఏప్రిల్ 6

మిగతా 3లో...

## ఆరు గ్యారెంటీల కోసం

# అవస్థలు

### : కిషన్ రెడ్డి



**హైదరాబాద్,క్విక్ టుడే :** కాంగ్రెస్ పార్టీ పాలన తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలుప్రజల పాలిట గారడీలుగా మారాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫించన్లు, ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి ఇంత వరకు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక వనరులు ఎట్లా సమకూర్చుకుంటుందో స్పష్టత లేదని ఆరోపించారు. అప్పులు తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. పొదుపు సంఘాల మహిళల సమా వేశంలో అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చరన్నారు.

మిగతా 3లో...

## రేవంత్ అసభ్యపదజాలంపై

# కవిత ఆగ్రహం

### పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్



**హైదరాబాద్,క్విక్ టుడే :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. ’ఎక్స్’ వేదికగా సీఎం వైఖరిపై మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై అసభ్య పదజాలం ప్రయోగించిన సీఎం రేవంత్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై పోలీసులు కేసు నమోదు చేయకపోతే న్యాయస్థానాలను ఆశ్రయి స్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే, దళిత బిడ్డ బాల్క సుమన్‌పై కేసు నమోదు

మిగతా 3లో...

## క్విక్ టుడే కథనానికి స్పందించిన జిల్లా అధికారులు





**గుండాల, క్విక్ టుడే,**
గుండాల మండల కేంద్రం నుండి నూనెగూడెం వెళ్లే మిషన్ భగీరథ పైప్ లైన్ రంధ్రం పడి నీరు వృథాగా అవుతోంది. కాగా మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ పట్టించుకునే వారు లేరా అనే కథనం ఆదివారం క్విక్ టుడే దినపత్రికలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా అదికారులు మంగళవారం పైప్ లైన్ లీకేజీకి వెల్డింగ్ పనులు పూర్తిచేశారు. లీకేజీ పనులు చేయించినందుకు నూనెగూడెం గ్రామ ప్రజలు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రత్యేకాధికారులు బాధ్యతాయుతంగా
# విధులు నిర్వర్తించాలి
### -మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్, కలెక్టరేట్, క్విక్ టుడే :** గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు వారి విధులను, బాధ్యతలను పూర్తిగా అవగాహన చేసుకుని విధులు నిర్వర్తించాలని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, ప్రత్యేక అధికారులకు సూచించారు. మంగళ వారం జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 61 గ్రామ పంచాయతీలకు, జిల్లా అధికారులను, మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. వీరు బాధ్యతలు కూడా స్వీకరించారని తెలిపారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు అందరు నూతన పంచాయితీరాజ్ యాక్ట్ 2018 పై స్పష్టమైన అవగాహన పొందాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలను సక్రమంగా నిర్వహించే గురుతర బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉంచిందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.గ్రామపంచాయతీ నిర్వహణను ప్రతిష్టాత్మకం గా తీసుకోవాలని ,గ్రామ పంచాయతీల సక్రమ నిర్వహణకు సీనియర్ అధికారులను సైతం గ్రామపంచాయతీ అధికారులుగా నియమించడం జరిగిందని, ప్రత్యేక అధికారులు సర్పంచుల కన్నా ఇంకా జాగ్రత్తగా గ్రామపంచాయతీల విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక అధికారులుగా నియామకం అయినందున పంచాయితీ శాఖ అధికారాలు, విధులు తెలుసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాభివృద్ధిలో భాగంగా వివిధ దశలలో వున్న అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మౌళిక సదుపాయాల కల్పనతో పాటు గ్రామాలలోని యువతను అభివృద్ధి పనులలో భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. పంచాయితీ రాజ్ చట్టంలో సూచించిన విధంగా క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనులు







నిర్వహించాలని, గ్రామ పంచాయితీ సెక్రటరీ, సిబ్బంది సమన్వయంతో ప్రజల అవసరాలను తీర్చాలని, గ్రామాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామ సభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహించి ఆదాయ వ్యయాలపై సమీక్షించాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికల రూపొందించి గ్రామ సర్పంచ్ పోర్టల్ లో నమోదు చేయాలని, 100 శాతం ఇంటి పన్నులు వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మేడ్చల్ జిల్లా హైదరాబాద్ కి దగరగా వుంది అభిరుద్ధి చాల వేగవంతము గా ఉంటుంది కావునా గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినారు మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలలో భూములను కాపాడటం లో ప్రత్యేక దృష్టి సారించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయితీల ఆస్తులను పరిరక్షించాలని, లే అవుట్లను పరిశీలించాలని, తప్పనిసరిగా లే అవుట్లో పది శాతం గ్రామ పంచాయితీకి చెందేలా చూడాలని అన్నారు. నిబంధనల ప్రకారమే బిల్డింగ్ అనుమతుల ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఉపాధి హామీలో గ్రామాల అవసరాలకు అనుగుణంగా ఎక్కువ పనులు చేపట్టేలా, ఎక్కువ మందికి పనులు కల్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ సంబంధించిన 7 రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించబడేలా చూడాలని, అలాగే గ్రామ పంచాయితీలలో జరిగిన పనులకు సంబంధించి రికార్డులు ఆడిట్ చేయించాలని, ప్రతి నెలా సిబ్బంది జీతాలు, సిసి బిల్లులు, ట్రాక్టర్, ట్రాలీ పేమెంట్స్ చెల్లించేలా చూడాలని తెలిపారు. గ్రామ పంచాయితీల ఆదాయ మార్గాలను పరిరక్షించాలని, రిజిష్టర్స్ నిర్వహించాలని, వచ్చే నిధులలో పారిశుద్యం, తాగునీటిపై నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని తెలిపారు. గ్రామ పంచాయితీల నిర్వహణలో భాగంగా నీటి సరఫరా, పారిశుద్యం, గ్రీవెన్స్, టాక్స్ కలెక్షన్స్, బడ్జెట్ తదితర రిజిష్టర్లను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు.

జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, పంచాయతీరాజ్ చట్టం, స్టాండింగ్ కమిటీలు, ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు, విధులు, లేఅవుట్ల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ ,తదితర అంశాలపై కూలంకషంగా వివరించారు..

ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులకు పంచాయితీ రాజ్ చట్టం 2018, విధులు, బాధత్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, డీపీవో రమణమూర్తి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి, గ్రామ పంచాయితీల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో కేరీర్ గైడ్స్ నిర్వహణ





**గుండాల, క్విక్ టుడే :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని కేజీబీవీ గుండాల పాఠశాలలో మంగళవారం రోజు జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో 10 వ తరగతి విద్యార్థినులకు కెరీర్ గైడెన్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీఈసీవో రాధా, మహేష్ కౌన్సెలర్, నికిత భార్గవి కేజీబీవీ ఎస్.ఓ విజయలక్ష్మి పాఠశాల టీచర్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం కోల్పోయిన బాల్కసుమన్
### -ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి, క్విక్ టుడే :**
బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ మతిస్థిమితం కోల్పోయి సీఎం రేవంత్‌రెడ్డిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. యాదగిరిగుట్ట లోని తన నివాసంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికే సీఎం రేవంత్ పై బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఖండించారు. కాంగ్రెస్ నేతలపై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని తెలిపారు. ఎన్నికల ముందు ఓట్లు దండుకోవడానికే నాగార్జున సాగర్ వద్ద గొడవ సృష్టించారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చిత్తుగా ఓడిపోతుందని అన్నారు.



## బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం
### - సీఎం రేవంత్ రెడ్డిపై అసభ్య పదజాలంపై మండిపడిన యూత్ కాంగ్రెస్





**పీర్జాదిగూడ, క్విక్ టుడే :** సీఎం రేవంత్‌రెడ్డిపైన అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. సోమవారం ముఖ్యమంత్రిపై అసభ్య పదజాలంతో దూషించడాన్ని వ్యతిరేకిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప్పల్ బస్ డిపో వద్ద బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్ గౌడ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, ప్రభాకర్ రెడ్డి, దర్గా సుధాకర్ రెడ్డి, జంగాచారి, సురేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, పవన్ గౌడ్, మజర్, కవిడె కుమార్, నాగరాజు, మణిరాం నాయక్, జైహింద్, నర్సింహా రెడ్డి, కె. కుమార్, సునిల్, ఎన్ఎన్ కే దుర్గ, సుదర్శన్ రెడ్డి , భరత్, గణేష్ నాయక్, సుధీర్, సాయిరాం, ఉదయ్ రాజ్ గౌడ్, జలగం శరత్ గౌడ్ , మహేష్,ప్రభంజన్, అర్జున్, శ్రవణ్, వంశీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

**గుండాల, క్విక్ టుడే :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో నేటి నుంచి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాలమేరకు బుధవారం నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని గుండాల ఎంపిడిఓ గార్లపాటి శ్రీనివాస్, తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక పాలన అదికారులు ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కులగణన తరవాతే స్థానిక ఎన్నికలు
### ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**వరంగల్:** రాష్ట్రంలో కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన మేరకు 6 నెలల్లో కులగణన చేపట్టడానికి తక్షణమే పక్రియ ప్రారంభించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఆగమాగం నిర్వహించాలనుకుంటే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. మంగళవారం వరంగల్ లో బీసీ హక్కుల సాధన కోసం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

## 17 ఎంపి సీట్లు గెలవడమే బిజెపి లక్ష్యం
### బిజెపి జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్

**కరీంనగర్,ఫిబ్రవరి 6:** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ సహా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను సాధించడమే బీజేపీ లక్ష్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ జోస్యం చెప్పారు. హైదరాబాద్ తమ జాగీరని ఎంఐఎం భావిస్తోందని, పాతబస్తీలోని హిందువులంతా ఓటు బ్యాంకుగా మారి బీజేపీని గెలిపించబోతున్నారని చెప్పారు. కరీంనగర్ లోని 48వ డివిజన్ లోని బ్రాహ్మణవాడలో 20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం 58వ డివిజన్ లో ఎంపీ లాడ్స్ నిధులకు సంబంధించి రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ సహా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే బీజేపీ లక్ష్యంగా పనిచేస్తోంది. ఇప్పటి వరకు హైదరాబాద్ ఎంఐఎం జాగీరని భావించారు. కానీ పాతబస్తీలోనూ హిందువులంతా ఓటుబ్యాంకుగా మారబోతున్నరు. హైదరాబాద్ పై కాషాయ జెండాను ఎగరేయబోతున్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ సహా రాష్ట్రంలో లక్షలాది భోగస్ ఓట్లున్నట్లు ఆధారాలు సేకరించాం. అట్లాగే పెద్ద ఎత్తున ఓట్లు కూడా గల్లంతయ్యాయి.

జన్మదిన, వివాహ
పదవీ విరమణ
శుభాకాంక్షలు


ఉద్యోగం, వ్యాపారం
రియల్ ఎస్టేట్
బహిరంగ ప్రకటనలు

జయంతి, వర్థంతి
శ్రద్ధాంజలి, నిర్యాణము
అన్ని రకాల ప్రకటనల కోసం సంప్రదించండి
88864 60073
81259 72476

# సహజీవనంలో ఉండాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. లేదంటే ఆరు నెలల జైలు శిక్ష..!

**డెహ్రాడూన్ :** ఉమ్మడి పౌర స్మృతి బిల్లు(యూసీసీ)ను ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మంగళవారం ప్రవేశపెట్టారు. ఇటీవలే యూసీసీ బిల్లును ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. ఈ బిల్లు అసెంబ్లీలో పాస్ అయితే.. ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రజలందరికీ యూసీసీ నిబంధనలు వర్తించనున్నాయి. ఆ చట్టాలకు మతపరమైన అధికారాలు ఉండవు. పెళ్లి, విడాకులు, వారసత్వం, దత్తత లాంటి వ్యక్తిగత విషయాల అంశంలో ఉమ్మడి పౌర స్మృతి బిల్లు కీలకం కానున్నది. ఈ బిల్లును సీఎం అసెంబ్లీలో ప్రవేశపెట్టే సమయంలో జై శ్రీరాం, వందే మాతరం వంటి నినాదాలతో సభ దద్దరిల్లిపోయింది. ఉమ్మడి పౌరస్మృతి బిల్లు అమల్లోకి వస్తే.. సహజీవనంలో ఉండాలనుకునే వారు, ఇప్పటికే ఉన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. ఎవరైతే ఈ చట్టం నిబంధనలను పాటించరో వారికి ఆరు నెలల జైలు శిక్ష విధించడంతో రూ. 25 వేలు జరిమానా విధించనున్నారు. యూసీసీ బిల్లు ప్రకారం.. 21 ఏండ్ల లోపు పిల్లలు సహజీవనం చేయాలనుకుంటే తల్లిదండ్రుల ఆమోదం తప్పనిసరిగా పొంది ఉండాలి. దాంతో పాటు ప్రభుత్వం వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఇక యూసీసీ ప్రకారం.. సహ జీవనంలో ఉండి విడిపోతే బాధితురాలు కోర్టును ఆశ్రయించొచ్చు. మెయింటెనెన్స్ కూడా చేసుకు నేందుకు ఆమె అర్హురాలిగా బిల్లులో పేర్కొన్నారు. లివిన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న బిడ్డ జన్మిస్తే.. అతని చట్టబద్ధమైన బిడ్డగా ప్రకటిస్తారు. సహజీవనం వద్దనుకున్నప్పుడు కూడా తప్పనిసరిగా వారు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి. ఒకవేళ ఈ బిల్లు అసెంబ్లీలో పాసైతే స్వాతంత్ర్యం తర్వాత ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేసిన మొదటి రాష్ట్రంగా



ఉత్తరాఖండ్ నిలువనున్నది. అయితే ఇదే చట్టాన్ని అమలు చేయడానికి బీజేపీ పాలిత రాష్ట్రాలైన అస్సాం, మధ్యప్రదేశ్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. పోర్చుగీసు పాలనలో ఉన్న గోవాలో కూడా ఇలాంటి సివిల్ కోడ్ రూల్ చాన్నాళ్లుగా అమలులో ఉన్నది.

# శాంసంగ్ నుంచి మిడ్ రేంజ్ స్మార్ట్ ఫోన్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7..

## ఇవీ స్పెషిఫికేషన్స్..!

దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్ మేజర్ శాంసంగ్ తన శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్7 ఫోన్‌ను మంగళవారం భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. రిమూవబుల్ బ్యాటరీ ఫెసిలిటీ గల శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7 రగ్డ్ ఫోన్‌ను గత నెలలోనే గ్లోబల్ మార్కెట్లలో ఆవిష్కరించింది. భారత్ మార్కెట్లో స్టాండర్డ్ ఎడిషన్, ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్‌లలో లభిస్తుంది. 4050 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతోపాటు సింగిల్ 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరా ఉంటుంది. భారత్ మార్కెట్లోనే తాము విడుదల చేసిన ఫస్ట్ ఎవర్ ఎంటర్ ప్రైజ్ ఫోకస్డ్ స్మార్ట్ ఫోన్ గెలాక్సీ ఎక్స్ కవర్7 అని శాంసంగ్ తెలిపింది. శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7 ఫోన్ స్టాండర్డ్ ఎడిషన్ ధర రూ.27,208, ఎంటర్‌ప్రైజ్ ఎడిషన్ ధర రూ.27,530 పలుకుతుంది. 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వర్షన్ తో ఈ ఫోన్ అందుబాటులో ఉంది. స్టాండర్డ్ ఎడిషన్ ఒక ఏడాది, ఎంటర్ ప్రైజ్ ఎడిషన్ ఫోన్‌కు రెండేండ్ల వారంటీ ఉంటుంది. శాంసంగ్ వెబ్ సైట్, ఆన్ లైన్ ఈపీపీ పోర్టల్ ద్వారా కార్పొరేట్, సంస్థాగత కస్టమర్లు కొనుగోలు చేయొచ్చు. గెలాక్సీ ఎక్స్ కవర్ 7 ఎంటర్ ప్రైజ్ ఎడిషన్ 12 నెలల నాక్స్ సూట్ సబ్ స్క్రిప్షన్ కూడా అందిస్తున్నది. శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7 ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఔటాఫ్ బాక్స్ వర్షన్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 60 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.6 - అంగుళాల ఫుల్ హెచ్డీ (1080 2408 పిక్సెల్స్) టీఎఫ్‌టీ డిస్ప్లే కలిగి ఉంటుంది. సెల్ఫీ కెమెరా వద్ద వాటర్ డ్రాప్ స్టైల్ నాచ్ డిస్ ప్లే ఉంటుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్ ఉంటది. అన్ నేమ్డ్ ఒక్టాకోర్ 6ఎన్ఎం ప్రాసెసర్, మీడియాటెక్ డైమెన్సిటీ 6100 ఎస్వోసీ చిప్ సెట్ తో వస్తుంది. శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7 ఫోన్ సింగిల్ 50-మెగా పిక్సెల్ రేర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 5-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. 6జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ కెపాసిటీ ఉన్నప్పటికీ మైక్రో ఎస్డీ కార్డ్ సాయంతో ఒక టిగా బైట్ వరకూ స్టోరేజీ కెపాసిటీ పెంచుకోవచ్చు. శాంసంగ్ గెలాక్సీ ఎక్స్ కవర్ 7 ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై 802.11 ఏ/బీ/ జీ/ఎన్/ఏసీ, వై-ఫై డైరెక్ట్, బ్లూటూత్ 5.3, ఎన్ఎఫ్‌సీ, యూఎస్బీ టైప్ సీ పోర్ట్ విత్ పోగో పిన్, జీపీఎస్, గ్లోనాస్, 3.5 ఆడియో జాక్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది.



యాక్సెలరో మీటర్, ప్రాగ్జిమిటీ సెన్సర్, జియో మ్యాగ్నటిక్ సెన్సర్, లైట్ సెన్సర్, గైరో సెన్సర్, ఉంటాయి. అథంటికేషన్ కోసం ఫేస్ రికగ్నిషన్ ఫీచర్ ఉం టుంది. డోల్బీ ఆట్మోస్ సౌండ్ టెక్నాలజీతో కూడిన స్పీకర్లు ఉంటాయి.

# పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా మోహ్సిన్ నఖ్వీ

వన్డే వరల్డ్ కప్ ముగిసిన తర్వాత వరుస వైఫల్యాలకు తోడు జట్టులో విభేదాలు, వర్గాలవారీగా విడిపోయి పరవు పోగొట్టుకుంటున్న పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు కొత్త అధ్యక్షుడు వచ్చాడు. నేడు లాహోర్ వేదికగా ముగిసిన పీసీబీ అధ్యక్ష ఎన్నికలలో సయిద్ మోహ్సిన్ రజా నఖ్వీ పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు కొత్త చైర్మన్‌గా నియమితుడయ్యాడు. బోర్డు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. పీసీబీకి 37వ అధ్యక్షుడిగా ఎన్నికైన నఖ్వీ.. నేటి నుంచి మూడేండ్ల పాటు పదవిలో కొనసాగనున్నాడు. పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రానికి ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న నఖ్వీ.. ఎంపిక గత నెలలోనే పూర్తైనా అధికారికంగా ఎన్నికల ప్రక్రియ నేడు ముగిసింది. పీసీబీ తాత్కాలిక చీఫ్‌గా ఉన్న షా ఖవర్ ఆధ్వర్యంలో అధ్యక్ష ఎన్నికలకు ఓటింగ్ జరుపగా బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా నఖ్వీని ఎన్నుకున్నారు. 2022లో రమీజ్ రాజా తర్వాత పీసీబీకి ఫుల్ టైమ్ చైర్మన్‌గా ఎన్నికైంది నఖ్వీనే కావడం గమనార్హం. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పదవి నుంచి దిగిపోయాక రమీజ్ రాజా సైతం వైదొలగాల్సి వచ్చింది. అతడి స్థానంలో నజమ్ సేథీ సుమారు ఏడాదిపాటు పీసీబీ చీఫ్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత జకా అష్రఫ్ ఆ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఏడాది జనవరి 19న అష్రఫ్ తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. పీసీబీ చీఫ్‌గా ఎన్నికవడంపై నఖ్వీ స్పందిస్తూ%ా% 'పీసీబీ చైర్మన్‌గా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్స్‌కు ధన్యవాదాలు. నా మీద నమ్మకముంచినందుకు కృతజ్ఞుడను. దేశంలో క్రికెట్ అభివృద్ధితో పాటు పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రొఫెషనలిజం తీసుకురావడానికి నావంతు కృషి చేస్తా..'అని చెప్పాడు. 45 ఏండ్ల నఖ్వీ.. గతంలో అమెరికా వేదికగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న



సీఎన్ఎన్ ఛానెల్‌లో విధులు నిర్వర్తించాడు. ఆ తర్వాత పాకిస్తాన్‌కు వచ్చి పత్రికతో పాటు టీవీ ఛానెల్స్‌ను ఏర్పాటుచేశాడు. పాకిస్తాన్‌లోని 24 న్యూస్ ఛానెల్ ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్నదే..

# 'తగ్గేదే లే' అంటున్న హౌతీలు..

## ఎర్ర సముద్రంలో అమెరికా, బ్రిటన్ నౌకలపై దాడులు..!



యెమెన్‌లోని హౌతీల స్థావరాలపై అమెరికా, బ్రిటన్ చేస్తున్న వైమానిక దాడులకు హౌతీ తిరుగుబాటుదారులు ఏమాత్రం బెదరడంలేదు. అమెరికా, బ్రిటన్ తమపై ఎన్ని దాడులు చేసినా తగ్గేదేలే అన్నట్టుగా ప్రతీకార దాడులకు పాల్పడుతున్నారు. తాజాగా ఎర్ర సముద్రంలో అమెరికా, బ్రిటన్‌కు చెందిన రెండు నౌకలపై దాడి చేసినట్లు హౌతీ మిలిటెంట్స్ ప్రకటించారు. అమెరికా నౌక 'స్టార్ నాసియా'పై తొలి బ్రిటిష్ నౌక 'మార్నింగ్ టైడ్'పై తాము దాడి చేశామని హౌతీ మిలిటెంట్స్ ప్రతినిధి యాహ్యా సారె తెలిపారు. బ్రిటన్ నౌకపై దాడిని ఆ దేశ సెక్యూరిటీ అండ్ ఇంటెలిజెన్స్ వింగ్ కూడా ధృవీకరించింది. యెమెన్‌లో హౌతీల ఆధీనంలోని హుదేడా పోర్టు నుంచి జరిపిన క్షిపణి దాడిలో మార్నింగ్ టైడ్ నౌక స్వల్పంగా దెబ్బతిన్నదని పేర్కొన్నది. అయితే నౌకలోని సిబ్బంది ఎవరూ గాయపడలేదని తెలిపింది. బార్బడోస్ జెండాతో వస్తున్న నౌక బాబ్ ఎల్ మండెప్ జలసంధి దాటగానే స్పీడ్ పెంచినప్పటికీ హౌతీల దాడికి చిక్కిందని బ్రిటన్ పేర్కొంది. నౌకపై యాంటీ షిప్ మిసైల్‌తో దాడి జరిగినట్లు సమాచారం. ఈ నౌక బ్రిటన్‌లోని ఫురాడినో కంపెనీకి చెందినదిగా గుర్తించారు. దాడి జరిగినా తమ నౌక ప్రస్తుతం ప్రయాణం కొనసాగిస్తోందని ఫురాడినో కంపెనీ ప్రకటించింది. కాగా ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు చేస్తున్న హౌతీల ఆగడాలకు చెక్ పెట్టేందుకు అమెరికా, బ్రిటన్ దేశాలు.. ఇటీవల వారి స్థావరాలపై దాడులను తీవ్రతరం చేశారు. రెండు దేశాల సేనలు గత వారం హౌతీ స్థావరాలపై బాంబులతో విరుచుకుపడ్డాయి. వాణిజ్య నౌకలపై దాడికి సిద్ధంగా హౌతీలు సిద్ధంగా ఉంచుకున్న క్షిపణులు ఈ దాడుల్లో ధ్వంసమయ్యాయి.

(మొదటి పేజీ తరువాయి)

## కృష్ణా ప్రాజెక్టుల కోసం మరో ఉద్యమం

కేఆర్ఎంబికి సాగర్ శ్రీశైలం సహా కృష్ణా నదిమీద ప్రాజెక్టులను అప్పజెప్పి కేంద్రం చేతికి మన జుట్టు అందించిందని కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణ వ్యవసాయ రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని.. ప్రజా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ఎండగడుతామని బీఆర్ఎస్ అధినేత ప్రకటించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో కృష్ణా బేసిన్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రముఖులతో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణా నదిపై ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబి కి అప్పగించడం వల్ల రాష్ట్ర రైతాంగానికి తలెత్తే నష్టాలు పర్యవసానాలు పై చర్చ నిర్వహించారు. కృష్ణా ప్రాజెక్టులు నదీ జలాలపై రాష్ట్ర హక్కులను కాపాడుకునేందుకు.. రాష్ట్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేఖ వైఖరిపై చేపట్టవలసిన తదుపరి కార్యాచరణపై కేసీఆర్ నేతలందరికీ దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ సాగునీరు తాగునీటి హక్కులకోసం పోరాడడమే కాకుండా.. 'మా నీళ్లు మాకే' అనే ప్రజా నినాదాన్ని స్వయంపాలన ప్రారంభమైన అనతికాలంలోనే నిజం చేసి చూయించిన ఘనత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కేఆర్ఎంబి పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణ కున్న హక్కులను కైవసం చేసుకునేందుకు కేంద్రం వేసే ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ కేంద్రం వత్తిళ్ళను తట్టుకుంటూ పదేండ్లపాటు బిఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసి కాపాడిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో సంతకాలు చేసి తీసుకున్న నిర్ణయం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టలమీదికి కూడా పోలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేసారు. దీన్ని ప్రజా మద్దతుతో

తిప్పికొడుతామన్నారు. తద్వారా హైదరాబాద్ రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు తాగునీరు అందక తిరిగి కరువుకోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచివున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర మూర్ఖపు వైఖరిని తిప్పికొట్టి కృష్ణా జలాలపై ప్రాజెక్టులపై తెలంగాణకు రావలసిన వాటాను హక్కులను నూటికి నూరుశాతం కాపాడేందుకు ఎందాకనైనా పోరాడాల్సిందేనని కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బిఆర్ఎస్ పార్టీ ఉన్నత స్థాయి సమావేశం తీర్మానించింది. ఈ క్రమంలో కృష్ణా ప్రాజెక్టుల కోసం పోరాటం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ నెల 13న నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహించి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలివి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ కు పోరాటం కొత్తకాదని, రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులను కేంద్రం ఆధీనంలోకి వెళ్లేలా చేస్తున్నారంటూ గులాబీ నేతలు మండిపడుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ అంశానికి సంబంధించి కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేసీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చిన 10 ఏళ్లలో ఏనాడూ తెలంగాణ ప్రాజెక్టులు అప్పగించలేదని అన్నారు. ప్రాజెక్ట్‌లు మాకు అప్పగించాలని లేదంటే మేమే నోటిఫై చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ శకావత్ నన్ను బెదిరించారు. కావాలంటే తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెట్టుకో... నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా... తెలంగాణకు అన్యాయం చేస్తా అంటే అస్సలే ఊరుకోను.. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే చెప్పిన. నన్ను వ్యక్తిగతంగా, బీఆర్ఎస్ పార్టీని కొత్త సీఎం ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. నన్ను ...నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు... నీ కంటే హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకున్నది.. రాష్ట్రాన్ని పదేళ్లు పదిలంగా కాపాడుకున్నం... దాన్ని పరాయి వాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఏనాడూ వెనక్కు పోడు... ఉడుత బెదిరింపులకు భయపడను... ముందు ముందు ఏందో చూద్దాం... తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు అంటూ కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి ప్రాజెక్టుల మీద అవగాహన లేదని కేసీఆర్ సమావేశంలో అన్నారు. ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టం కూడా వాళ్లకు తెలియదన్నారు. రైతులకు నష్టం చేసేలా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తున్నాం. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా పోరాడుతాం.

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి

ఇందులో భాగంగా సింగపూర్ కు చెందిన మెయిన్హార్డ్ట్ కంపెనీ ప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. వివిధ దేశాల్లో తాము చేపట్టిన ప్రాజెక్టు డిజైన్లతో పాటు హైదరాబాద్లో మూసీ డెవెలప్మెంట్కు అనుసరించాల్సిన ప్రాజెక్టుల నమూనాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నమూనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంపెనీ ప్రతినిధులకు సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్డు, సిటీ చుట్టూ రాబోయే రైలు మార్గాల విస్తరణతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయని అన్నారు. వాటికి అనుగుణంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ నమూనాలు రూపొందించాలని సూచించారు. మెయిన్ హార్ట్డ్ గ్రూప్ సీఈవో ఒమర్ షహజాద్, సురేష్ చంద్ర తో పాటు ప్రతినిధి బృందం సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవెలప్మెంట్ అథారిటీ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, హెచ్ఎండిఏ జాయింట్ కమిషనర్, మూసీ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ అమ్రాపాలి ఈ భేటీలో పాల్గొన్నారు.

## కాళేశ్వరంతో తెలంగాణ సర్వనాశనం

సవాల్ విసిరారు. కేసీఆర్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ఏపీ సీఎం జగన్‌తో ఎందుకు ఏకాంత చర్చలు జరిపారని నిలదీశారు. కేసీఆర్, జగన్ కలిసి తెలంగాణపై కుట్ర చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ వల్ల తెలంగాణకు తీవ్రమైన నష్టం కలిగిందని తెలిపారు. కాసుల కక్కుర్తితో కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులు కూలిపోతున్నాయని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు.

## రేవంత్ అసభ్యపదజాలంపై కవిత ఆగ్రహం

చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబించిన విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం అవలంభిస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఢిల్లీ రిమోట్ కంట్రోల్ పాలన రాచరిక వ్యవస్థను తలపిస్తోందన్నారు. సూర్యునిపై ఉమ్మేస్తే అది తిరిగి మీ మీదే పడుతుందన్న విషయం రేవంత్ రెడ్డి మర్చిపోవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను సాధించిన కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని కవిత వ్యాఖ్యానించారు.

## టీఎస్ ఈఏపీసెట్ షెడ్యూలు విడుదల

వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. మే 9 నుంచి 12 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మే 9 నుంచి 11 వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ కోర్సులకు ఎంట్రెన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. అలాగే మే 12న అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ప్రవేశ పరీక్ష జరగనుంది. ఉన్నత విద్యామండలి ఇటీవలే ఎంసెట్ పేరును ఈఏపీసెట్‌గా మార్చిన సంగతి తెలిసిందే. జేఎన్టీయూ హైదరాబాద్ పరీక్షలు నిర్వహించనుంది. ఇతర ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూలు ఇలా..ఉన్నాయి. టీఎస్ ఈసెట్ ప్రవేశ పరీక్షను మే 6న నిర్వహించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో పరీక్ష జరగనుంది. బీఈడీ కోర్సులో ప్రవేశాలకు ఉద్దేశించిన టీఎస్ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష మే 23న జరగనుంది. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఈ పరీక్షను నిర్వహించనుంది. రాష్ట్రంలోని లా కాలేజీల్లో 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'టీఎస్ లా సెట్ 2024 పరీక్షను జూన్ 3న నిర్వహించనున్నారు. అదే విధంగా పీజీ లా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎల్ఎల్ఎం ఎంట్రెన్స్ టెస్టును కూడా అదేరోజు నిర్వహించనున్నారు. లాసెట్, పీజీ ఎల్‌సెట్‌లను ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించనుంది.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

గ్రూప్-1 పోస్టుల సంఖ్య 563కి చేరాయి. 2022 ఏప్రిల్ లో 503 పోస్టులకు టీఎస్‌పీఎస్-సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ సమయంలో 3,50,000 మంది దరఖాస్తు చేసుకు న్నారు. 2022 అక్టోబర్‌లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా.. 2,80,000 మంది హాజరయ్యారు. అయితే, ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలైనా.. పేపర్ లీకేజ్ కారణంగా ఆ పరీక్ష రద్దైంది. దాంతో 2023 జూన్‌లో మళ్లీ పరీక్షలు నిర్వహించారు.

# పేటీఎంకు స్టార్టప్'ల దన్ను.. పున

## : పరిశీలించాలని కేంద్రానికి అప్పీల్..!




ప్రముఖ ఫిన్ టెక్ స్టార్టప్ 'పేటీఎం ' సంక్షోభంపై పలు స్టార్టప్ కంపెనీల వ్యవస్థాపకులు స్పందించారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై ఆర్బీఐ విధించిన నిషేధాన్ని పున: పరిశీలించాలని, సమీక్షించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతా రామన్, ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌లకు విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు. ఈ నెల 29 తర్వాత కీలక బ్యాంకింగ్ సేవలను నిలిపివేయాలని జనవరి 31న పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్ (పీపీబీఎల్)ను ఆర్బీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే.ఆర్బీఐ గవర్నర్, కేంద్ర ఆర్థిక మంత్రిలకు రాసిన లేఖపై పాలసీ బజార్ ఫౌండర్ యాశిష్ దాహియా, భారత్ మ్యాట్రిమోనీ వ్యవస్థాపకుడు మురుగావెల్ జానకీరామ్, మైక్ మై ట్రిప్ ఫౌండర్ రాజేశ్ మాగోవ్, ఇన్నోవ్ 8 వ్యవస్థాపకుడు రితేశ్ మాలిక్ సంతకాలు చేశారు. పేటీఎంపై విధించిన నిషేధాజ్ఞలు.. కేవలం ఆ సంస్థపైనే కాక ఫిన్ టెక్ సంస్థల లావాదేవీలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.పేటీఎంపై విధించిన ఆంక్షలను పున: పరిశీలించాలని, ఆర్థిక వ్యవస్థ విశాల ప్రయోజనాలను, ఫిన్ టెక్ కంపెనీల పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని స్టార్టప్ కంపెనీల వ్యవస్థాపకులు కోరారని తెలుస్తున్నది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) యూజర్ల ఖాతాలను క్రియేట్ చేయడంలో కేవైసీ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడింది. దీని పరిష్కారానికి విండో కల్పించాలని ఇందుకోసం బహిరంగ చర్చ, సహకారంతో ముందుకు సాగాలని స్టార్టప్‌ల వ్యవస్థాపకులు కోరారు.

# బిడ్డ సమాధి వద్ద..
# బోరున విలపించిన ఏనుగు



ఈ భూమ్మీద తల్లీబిడ్డల ప్రేమ వెలకట్టలేనిది. తల్లీబిడ్డల ప్రేమ, అనుబంధాల గురించి ఎంత చెప్పినా తక్కువే. బిడ్డ తన కంటికి క్షణం పాటు కనిపించకపోతే ఆ తల్లి తల్లడిల్లిపోతోంది. బిడ్డ ఆచూకీ కోసం అటుఇటు పరుగెడుతోంది. ఇక ఆ బిడ్డ కనిపిస్తే.. దగ్గరకు తీసుకొని ముద్దులు పెట్టి ప్రేమను వ్యక్తపరుస్తది. కానీ అదే బిడ్డ తన కళ్ల ముందు చనిపోతే ఆ తల్లి గుండెలవిసేలా రోదిస్తోంది. ఆ మాదిరిగానే ఓ ఏనుగు కూడా తన బిడ్డ కోసం బోరున విలపించింది. పిల్ల ఏనుగును పూడ్చిపెట్టిన సమాధి వద్ద కన్నీళ్లు కార్చుతూ అలానే ఉండిపోయింది ఏనుగు.ఈ హృదయవిదారక ఘటనను ఐఎఫ్ఎస్ ఆఫీసర్ సుశాంత నంద తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. అయితే ఓ ఏనుగు తన పిల్ల ఏనుగుకు జన్మనిచ్చింది. కానీ కొన్ని గంటల్లోనే ఆ పిల్ల ఏనుగు చనిపోయింది. పోస్టుమార్టం అనంతరం దాన్ని పూడ్చిపెట్టారు. ఇక ఆ సమాధి వద్దకు చేరుకున్న తల్లి ఏనుగు.. బోరున విలపించింది. తన కళ్ల నుంచి కన్నీరు కారుతూనే ఉంది. ఏనుగు గుండెలవిసేలా రోదించడంతో అక్కడున్న అటవీశాఖ అధికారుల హృదయాలు బరువెక్కిపోయాయి. తల్లీపిల్లల మధ్య ఉండే ప్రేమ, అనుబంధం వర్ణనాతీతం అని సుశాంత నంద పేర్కొన్నారు.

# మెడికల్ కాలేజ్ హాస్టల్ రూంలో
# యువతి బలవన్మరణం



న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే మౌలానా అజాద్ మెడికల్ కాలేజ్ హాస్టల్ రూంలో 23 ఏండ్ల విద్యార్థిని అర్ధంతరంగా తనువు చాలించడం క్యాంపస్‌లో కలకలం రేపింది. ఢిల్లీకి చెందిన బాధిత విద్యార్థిని ఆ దివారం నగరంలోని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో గడిపి అదేరోజు సాయంత్రం హాస్టల్‌కు తిరిగివచ్చింది.సోమవారం ఉదయం హస్టల్ సహచరులు ఆమె రూంకు వచ్చి తలుపు కొట్టగా ఎంతసేపటికి బదులివ్వలేదు. దీంతో హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగలకొట్టి లోపలికి వెళ్లగా ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలిం చారు.బాధితురాలు ఇంత తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి కారణాలను తెలుసుకునేందుకు ఆమె కాల్ డిటైల్స్, వాట్సాప్ రికార్డ్‌ను చెక్ చేస్తున్నామని, కుటుంబ సభ్యులనూ ప్రశ్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# అటల్ సేతుపై జర్నీ వీడియోను
## షేర్ చేసిన ఆనంద్ మహీంద్ర



దేశ వాణిజ్య రాజధాని ముంబైలో ప్రధాని ఇటీవల ప్రారంభించిన అటల్ సేతుపై ప్రయాణించాలన్న పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్ర కోరిక నెరవేరింది. ఈ ఐకానిక్ బ్రిడ్జిపై తన ప్రయాణానికి సంబంధించిన వీడియోను కార్పొరేట్ దిగ్గజం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. జనవరి 12న ఇంజనీరింగ్ అద్భుతంగా పిలిచే దేశంలోనే అతిపెద్ద సముద్రపు వంతెన అటల్ సేతును ప్రధాని మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే.ఇక ఆనంద్ మహీంద్ర వంతెన మీదుగా సాగే ప్రయాణాన్ని హోవర్‌క్రాఫ్ట్‌లో "నీటిపై గ్లైడింగ్"తో పోల్చారు. పుణేకు రాకపోకలు సాగిస్తూ ఈ బ్రిడ్జిపై నుంచి ఆనంద్ మహీంద్ర ప్రయాణించారు. సంధ్యా సమయంలో బ్రిడ్జి అందాలను ఆస్వాదించేందుకు వంతెనపై మరోసారి ప్రయాణించేందుకు ఆసక్తిగా వేచిచూస్తున్నానని పేర్కొన్నారు.ఎట్టకేలకు ఈ వారాంతంలో అటల్ సేతుపై ప్రయాణించాను..ఇది నీటిపై హోవర్‌క్రాఫ్ట్ గ్లైడింగ్ అనుభూతి ఇచ్చే అద్భుత ఇంజనీరింగ్ కట్టడం ఇదని, తాను పుణేకు వెళ్లి వస్తూ పగటి వేళ బ్రిడ్జి మీదుగా వెళ్లానని అయితే సాయంత్రం వేళలో ఈ వైరల్ పిక్‌లో ఉన్న అద్భుత దృశ్యాన్ని ఆస్వాదించలేకపోయానని ఆనంద్ మహీంద్ర ఈ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# పటాకుల ఫ్యాక్టరీలో పేలుడు..
## ఎనిమిదికి చేరిన మృతులు.. 87కు పెరిగిన క్షతగాత్రులు



మధ్యప్రదేశ్ రాష్ట్రం హర్దా జిల్లాలోని పటాకుల ఫ్యాక్టరీలో పేలుడు సంభవించిన ఘటనలో మృ తులు, క్షతగాత్రుల సంఖ్య అంతకంతకే పెరుగుతున్నది. అగ్నిమాపక సిబ్బంది, ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలు కాలి కూలిపోయిన శిథిలాలను తొలగిస్తున్నా కొద్ది క్షతగాత్రులు, మృతదేహాలు బయటపడుతున్నాయి. కొత్త మరో రెండు మృతదేహాలు, 28 మంది క్షతగాత్రులను వెలికి తీశారు.దాంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య ఎనిమిదికి చేరింది. క్షతగాత్రుల సంఖ్య 87కు పెరిగింది. ఈ విషయాన్ని మధ్యప్రదేశ్ మంత్రి ఉదయ్ ప్రతాప్ సింగ్ వెల్లడించారు. ఘటన గురించి జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రతింపులు జరుపుతున్నానని చెప్పారు.

# ఏపీలో రసవత్తరంగా పొత్తుల రాజకీయం..
# 2014 సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్!



సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్నా కొద్దీ ఏపీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఎలాగైనా జగన్ ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న పట్టుదలతో ఉన్న టీడీపీ-జనసేన పొత్తులపై తీవ్ర కసరత్తులు చేస్తున్నాయి. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైన ఈ తరుణంలో బీజేపీ కూడా వీళ్లతో కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే ఏపీలో 2014 ఎన్నికల నాటి సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఈ విషయం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఎప్పట్నుంచో చెబుతూనే ఉన్నాడు. దీనిపై చాలాసార్లు ప్రకటనలు కూడా చేశారు. ఈ క్రమంలోనే సీట్ల పంపకాలపై కూడా తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. ఈ నెల 5 వ తేదీ (సోమవారం ) దాదాపు 4 గంటల పాటు సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించారు. అయినప్పటికీ ఇంకా కొలిక్కిరాకపోవడంతో ఇవాళ కూడా భేటీ అయ్యారు. సీట్ల సర్దుబాటుతో పాటు ఏ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ భేటీలో సీట్ల పంపకాలపై చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఫిబ్రవరి 8వ తేదీన మరోసారి భేటీ కావాలని టీడీపీ, జనసేన నిర్ణయించుకున్నాయి. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పొత్తులపై నిర్ణయం తీసుకునే దిశగా కసరత్తులు కూడా చేస్తోంది. టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయడంపై ఇవాళ రాత్రిలోగా బీజేపీ అధిష్ఠానం ఒక స్పష్టతనిచ్చే ఛాన్స్ ఉంది.బీజేపీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లనున్నారు. అక్కడ బీజేపీ జాతీయ నేతలతో సంప్రదింపులు జరిపి పొత్తుల అంశాన్ని ఓ కొలిక్కి తీసుకొస్తారని సమాచారం. ఫిబ్రవరి 8వ తేదీన టీడీపీ, జనసేన భేటీ ఉన్న నేపథ్యంలో ఆలోపే బీజేపీతో పొత్తులపై క్లారిటీ తీసుకొని.. సీట్ల సర్దుబాటును ఖరారు చేసే అవకాశం ఉంది. అదే నిజమై.. టీడీపీ-జనసేన-బీజేపీ మధ్య కుదిరితే 2014 ఎన్నికల నాటి పరిస్థితులు పునరావృతమవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# వందే భారత్ స్లీపర్ రైలు వచ్చేస్తోంది..!
## తొలిసారి పరుగులు తీసేది ఈ రూట్‌లోనే..!




భారతీయ రైల్వేశాఖ ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో రైలు పరుగులు తీస్తున్నాయి. 2019లో ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలో రైల్వేశాఖ స్లీపర్ వర్షన్ తీసుకురానున్నట్లు ప్రకటించిన విష యం తెలిసిందే. ఈ ఏడాది మార్చి వరకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రైలు సిద్ధమవుతున్నది. తాజాగా వందే భారత్ స్లీపర్ తొలి రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది మార్చి నుంచి ఏప్రిల్ మధ్య ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి.ట్రయల్ రన్ విజయవంతమైన తర్వాత రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలు ప్రస్తుతం ఉన్న హైస్పీడ్ రైళ్లకంటే వేగంగా ప్రయాణిస్తాయని.. సుదూర ప్రాంతాలను కలుపుతూ వీటిని నడుపనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రాజధాని రైళ్ల వేగాన్ని అధిగమించే లక్ష్యంతో, ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు స్లీపర్ రైళ్లను నడపాలని యోచిస్తుందని రైల్వే వర్గాలు తెలిపాయి. మొదటి విడతలో పది రైళ్లను ప్రారంభిస్తారని.. ఇందులో ఢిల్లీ ముంబయి, ఢిల్లీ హౌరాతో సహా పలు మార్గాల్లో ఏప్రిల్‌లో స్లీపర్ వందే భారత్ రైళ్లను పటాలెక్కించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ స్లీపర్ రైళ్లలో కోచ్‌ల సంఖ్య దాదాపు 16-20 మధ్య ఉంటుందని చెప్పారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో రైళ్లు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లలో చైర్‌కార్ మాత్రమే అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. మరో వైపు రైల్వేశాఖ వందేభారత్ మెట్రోపై సైతం తీసుకురానున్నది. వీటిని సైతం ఈ ఏడాది ప్రారంభిస్తామని ప్రకటించినా.. ఎప్పటికి అందుబాటులోకి వస్తాయనేది ఇంకా తెలియరాలేదు. ఇదిలా ఉండగా ఇటీవల భారతీయ రైల్వేశాఖ గణనీయమైన అభివృద్ధి సాధించింది. కొత్తగా 26వేల కిలో మీటర్ల మేర ట్రాక్ వేసి నెట్‌వర్క్‌ను విస్తరించింది. భారతీయ రైల్వేలు రాబోయే 7 నుంచి 8 సంవత్సరాల్లో అదనంగా 40వేల కిలోమీటర్ల ట్రాక్‌లను నిర్మించాలని యోచిస్తోంది.

# అందరూ నితీశ్, ఏక్‌నాథ్ షిండేలు కారు..
# హేమంత్ సోరెన్‌లు ఉంటారు..!

### బీజేపీపై విరుచుపడ్డ సామ్నా

హేమంత్ సోరెన్ అరెస్ట్ తర్వాత జార?ండ్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. సీఎంగా హేమంత్ సోరెన్ రాజీనామా అనంతరం చంపై సోరెన్ ప్రమాణస్వీకారం చేసి.. అసెంబ్లీలో విశ్వాస పరీక్షను నెగ్గారు. నేటి రాజకీయాల్లో అందరూ నితీశ్‌కుమార్, అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండేలు కారని శివసేన పార్టీకి చెందిన సామ్నా తన సంపాదకీయంలో పేర్కొంది. కొందరు ఆత్మగౌరవంతో ఉన్న హేమంత్ సోరెన్‌లు ఉన్నారని.. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా గమనించాలంటూ చురకలంటించింది. 'మోదీ, అమిత్ షా కలిసి హేమంత్ సోరెన్‌ను ఈడీ ద్వారా రాజ్‌భవన్‌లో అరెస్టు చేశారు.సోరెన్ పార్టీలో ఎమ్మెల్యేల మధ్య చీలకవస్తుంది. ఈడీ ఒత్తిడితో ఎమ్మెల్యేలు పార్టీలు మారతారని బీజేపీ ఆశించింది కానీ అలాంటిదేమీ జరుగలేదు. హేమంత్ సోరెన్ వారసుడు చంపై సోరెన్ అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. విశ్వాస తీర్మానానికి అనుకూలంగా 47 మంది ఎమ్మెల్యేలు, వ్యతిరేకంగా 29 మంది ఎమ్మెల్యేలు ఓటు వేశారు. ఇంత మెజారిటీ ఉన్నప్పటికీ నాలుగు రోజులుగా చంపై సోరెన్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. ఈ నాలుగు రోజుల్లో సోరెన్ ఎమ్మెల్యేలను ఎలాగైనా తమ వైపు తిప్పుకోవచ్చని మోదీ-షా భావించారు. కానీ, జార?ండ్‌లోని ఆత్మగౌరవ గిరిజనులు వారికి తలొగ్గలేదు.అరెస్ట్ అయిన తర్వాత అసెంబ్లీకి వచ్చి తనదైన శైలిలో ప్రసంగించారని.. మోదీ-షా ప్రతీకార రాజకీయాలను సవాల్ చేశారు' అని పేర్కొన్నది. విశ్వాస పరీక్షలో ఓటింగ్‌కు హాజరైన హేమంత్ సోరెన్ మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని స్పష్టం చేశారు. ఏడెకరాల భూమికి సంబంధించిన లావాదేవీల్లో తనను అరెస్టు చేశారని.. ఈ భూమికి సంబంధించిన పత్రాలను ఈడీ బయటకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ముందుకు తీసుకువస్తే.. తప్పుంటు రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. అంతే కాకుండా జార?ండ్‌ను శాశ్వతంగా వదిలేస్తానన్నారు.సోరెన్ అరెస్టు రాజకీయ ఉగ్రవాదమని.. అణచివేతకు సంబంధించిన భయంకరమైన కేసు అని సామ్నా




తన సంపాదకీయంలో విమర్శించింది. రాష్ట్రంలోని సిట్టింగ్ సీఎంను తప్పుడు కేసుల్లో అరెస్టు చేసి.. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. హేమంత్ సోరెన్ తర్వాత ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు మోదీ-షా సిద్ధమవుతున్నారని ఆరోపించింది. బెదిరింపులతో మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని ఇప్పటికే కూల్చారని.. బిహార్‌లో నితీశ్ కుమార్‌తో 'ఫ్లిప్' చేయించారని పేర్కొంది.నితీశ్‌కుమార్ సన్నిహితులపై ఈడీ దాడులు చేసిందని.. అందుకే నితీశ్ కుమార్ తలవచ్చినట్లు సామ్నా పేర్కొంది. లాలూయాదవ్, ఆయన కుటుంబం మోదీ-షా తలవచ్చేందుకు సిద్ధంగా లేరన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రకంపనలు సృష్టించారని సామ్నా సంపాదకీయంలో పేర్కొన్నది. కేజ్రీవాల్ తాను బీజేపీ అణచివేతకు తల్గొనని అంటున్నారని.. మహారాష్ట్రలో శివరాయ్ వాంసత్వం చెబుతుంది కానీ.. మార్త్-మర్హతే అని చెప్పుకునే వారు ఢిల్లీ కాళ్లపై పడ్డారని విమర్శించింది. జార?ండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు పోరాటానికి కత్తులు దూశారంటూ బీజేపీ తీరును ఎండగట్టింది.సొంతంగా బలం లేని చోట కూలదోస్తుందని.. ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం.. ఇది ఏం చట్టమని స్వేచ్ఛ అంటూ ప్రశ్నించింది. అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండే తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నా మోదీకి ఇష్టమైన వ్యక్తులయ్యారు.. కానీ సోరెన్, కేజ్రీవాల్ మాత్రం వారి దృష్టిలో నేరస్తులుగా మారారని సామ్నా విమర్శలు గుప్పించింది. భారతీయ జనతా పార్టీ అవినీతి గూడుగా మారిందని, నైతికత వంటి మాటలకు అక్కడ విలువ లేదని.. ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం పోరాడుతున్న వారికి హేమంత్ సోరెన్ జైలు శిక్ష సరైన ఉదాహరణగా మారాలని పేర్కొంది.అరవింద్ కేజ్రీవాల్ తలవంచడానికి సిద్ధంగా లేరని.. ఉద్ధవ్ ఠాక్రే నిరాకరించారని.. మమతా బెనర్జీ పోరాట యోధురాలని పేర్కొంది. హేమంత్ సోరెన్ మోకరిల్లలేదని, ఏడువలేదని.. తలవంచలేదన్న సామన్నా.. విప్లవకారుడిలా జైలుబాట పట్టాడని ప్రశంసించింది. 'ఈ పోరాటం ద్వారా కొత్త దిశ, స్వాతంత్ర్య వెలుగులు అందుతాయని.. తలవంచి లొంగిన వారిని చరిత్ర ఎప్పటికీ క్షమించదని.. యోధుల కన్నీళ్ల విలువను హేమంత్ సోరెన్ చెప్పారు.. ఆ కన్నీళ్ల నుంచే రేపటి తుపాను సృష్టిస్తుంది!' అంటూ సామ్నా సంపాదకీయం రాసుకొచ్చింది.

# మార్కెట్‌లోకి 'భారత్ రైస్'..
# ప్రారంభించిన కేంద్రమంత్రి..

### ఎక్కడ కొనాలంటే..!



ఈ ఏడాది దేశంలో బియ్యం ధరలు భారీగా పెరగడంతో కేంద్ర ప్రభుత్వం 'భారత్ రైస్' పేరుతో రాయితీపై బియ్యం అమ్మకాలకు శ్రీకారం చుట్టింది. ఇవాళ (మంగళవారం) సాయంత్రం 4 గంటలకు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఈ సబ్సిడీ బియ్యం అమ్మకాలను ప్రారంభించారు.ఈ రాయితీ బియ్యాన్ని వినియోగదారులకు కిలో రూ.29కే అందజేయనున్నారు. ఇవాళ్టి నుంచి ఎన్ఏఎఫ్ఈడీ, ఎన్‌సీసీఎఫ్ కేంద్రీయ భండార్ సహా అన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ బియ్యాన్ని అందుబాటులో ఉంచనున్నారు.

# రూ.15 లక్షల కోట్ల 'క్లబ్'లో టీసీఎస్.. చరిత్రలో ఫస్ట్ టైం..!

దేశంలోనే అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మరో మైలురాయిని దాటింది. 'యూరోప్ అసిస్టెన్స్' సంస్థతో డీల్ కుదిరినట్లు సోమవారం ఎక్స్చేంజ్‌లకు టీసీఎస్ సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఆ సంస్థ స్టాక్ నాలుగు శాతానికి పైగా పుంజుకున్నది. బీఎస్ఈలో టీసీఎస్ స్టాక్ రూ.4,135.9 (2024 ఫిబ్రవరి 6) వద్ద ఆల్ టైం గరిష్ట స్థాయిని తాకింది. దీంతో టీసీఎస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15 లక్షల కోట్ల మార్క్‌ను దాటేసింది. ఈ మార్క్ ను టీసీఎస్ దాటడం ఇదే తొలిసారి.గ్లోబల్ అసిస్టెన్స్ అండ్ ట్రావెల్ ఇన్సూరెన్స్ సంస్థ 'యూరోప్ అసిస్టెన్స్'తో డీల్ గెలుచుకున్నట్లు స్టాక్ మార్కెట్లలో టీసీఎస్ ప్రకటించింది. ఈ డీల్ గ్లోబల్ ఐటీ ఆపరేటింగ్ మోడల్‌గా నిలుస్తుంది. ఈ డీల్‌లో భాగంగా యూరోప్ అసిస్టెన్స్ సంస్థకు 'ఎండ్ టు ఎండ్ ఐటీ అప్లికేషన్ సర్వీసెస్' అందించేందుకు యూరప్ అంతటా టీసీఎస్ డెలివరీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నది. యూరోప్ అసిస్టెన్స్ సంస్థతో డీల్ ప్రకారం ఆ సంస్థకు టీసీఎస్ తన ఇగ్నియో ఏఐ ఆప్స్ సేవలు అందించనున్నది. కో-ఇన్నోవేషన్ మీద రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. జెనరేటివ్ ఏఐ, ఇతర అడ్వాన్స్‌డ్ టెక్నాలజీల వినియోగంలో కలిసి పని చేస్తాయి.యూరోప్ అసిస్టెన్స్‌తో భాగస్వామ్యం ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఈలో మంగళవారం ఉదయం 10.02 గంటలకు 3.6 శాతం పెరిగి రూ.4,114.6 వద్ద ట్రేడయింది. అప్పుడు సంస్థ మార్కెట్ క్యాపి టలైజేషన్ రూ.15,06,376 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో టీసీఎస్ అంచనాలకు మించి రెవెన్యూ సాధించినట్లు నివేదించింది. 2022-23 మూడో త్రైమాసికంతో పోలిస్తే సంస్థ




కన్సాలిడేటెడ్ నికర లాభం రెండు శాతం పెరిగి రూ.11,058 కోట్లకు, ఆదాయం నాలుగు శాతం పెరుగుదలతో రూ.60,583 కోట్లకు చేరుకున్నది.

# కొనసాగుతున్న లేఆఫ్స్ పర్వం..

## కొత్త ఏడాది తొలి మాసంలో 30 వేల కోతలు

ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. ఏడాది కాలంగా గూగుల్ , మైక్రోసాఫ్ట్ అమెజాన్‌ట్విట్టర్ లింక్డిన్ మెటా వంటి టెక్ దిగ్గజాలు ఒకదాని తర్వాత ఒకటి సంస్థలోని ఉద్యోగులను తొలగించాయి. విడతల వారీగా ఉద్యోగులను ఇంటికి సాగనంపాయి. 2023లో టెక్ దిగ్గజాలతో పాటు స్టార్టప్‌లు సైతం ఎడాపెడా మాస్ లేఆఫ్స్‌కు తెగబడ్డాయి. ఇక కొత్త ఏడాది సైతం టెకీలపై లేఆఫ్స్ కత్తి వేలాడుతోంది. 2024లో అడుగుపెట్టామో లేదో తొలి మాసంలోనే వేల సంఖ్యలో ఉద్యోగులు కొలువులను కోల్పో యారు. గూగుల్, అమెజాన్, మెటా సహా పలు దిగ్గజ కంపెనీలు కొత్త ఏడాది ఆరంభంలో కొలువుల కోతకు తెగబడ్డాయి. ఈ ఏడాది లేఆఫ్స్ తప్పవనే విస్పష్ట సంకేతాలూ పంపాయి. ఈ ఏడాది ఆరంభం నుంచి దాదాపు 32 వేల మంది టెకీలు తమ ఉద్యోగాలను కోల్పోయినట్లు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ తాజాగా వెల్లడిం చింది. యూపీఎస్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, అసెంచర్ వంటి పెద్ద సంస్థలు కేవలం కొన్ని వారాల వ్యవధిలోనే వేలాది మందిని తొలగించినట్లు పేర్కొ ంది.లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డేటా ప్రకారం.. జనవరి 2024లో టెక్ కంపెనీల్లో జరిగిన మొత్తం తొలగింపులో యూపీఎస్ 40 శాతం వాటాను కలిగి ఉంది. కేవలం నెల వ్యవధిలోనే 12,000 మంది ఉద్యోగులను తొలగి ంచింది. ఇక గత నెల గూగుల్ సంస్థ 1,000 మంది ఉద్యోగులను తొలగించగా, పేపాల్ 2,500 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. జనవరి 2024లో ఉద్యోగాల కోతల సంఖ్యను అమెజాన్ వెల్లడించనప్పటికీ, ఆ సంఖ్య వేలల్లో ఉంటుందని అంచనా. యూట్యూబ్, టిక్‌టాక్, డిస్కార్డ్, ఈబే, పిక్సర్ వంటి ఇతర ప్రధాన సాంకేతిక సంస్థలు ఈ ఏడాది తొలి నెలలో సుమారు 5000 మంది ఉద్యోగులను తొలగి ంచాయి. పెరుగుతున్న ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఏఐ వంటి టెక్నాలజీలను ఉపయోగించుకోవడం వల్లే ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం అని స్పష్టమవుతోంది. ప్రస్తుతం చాలా కంపెనీలు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' వినియోగిస్తుండటం వల్ల.. ఇందులో నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోవడానికే చాలా కంపెనీలు సుముఖత చూపుతున్నాయి. దీని వల్ల కొత్త నియామకాల సంఖ్య తగ్గడమే కాకుండా.. ఉన్న ఉద్యోగులను కూడా టెక్ పరిశ్రమలు ఇంటికి పంపిస్తున్నాయి.గూగుల్‌జిసెర్చింజన్ దిగ్గజం గూగుల్ 2024 ఆరంభంలోనే పలువురు ఉద్యోగులపై వేటు వేసింది. హార్డ్‌వేర్, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్, అడ్వర్టైజింగ్ సహా పలు విభాగాల్లో 1000 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది.



గూగుల్‌లో మరిన్ని లేఆఫ్స్ తప్పవని కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్ ఉద్యోగులకు పంపిన మెమోలో స్పష్టం చేశారు. యూట్యూబ్‌జిగూగుల్ లేఆఫ్స్ నేపథ్యంలో యూట్యూబ్ సైతం తమ ఆపరేషన్స్‌తో పాటు క్రియేటర్ మేనేజ్‌మెంట్ టీమ్స్ నుంచి 100 మంది ఉద్యోగులను తొలగించింది. అల్ఫాబెట్ గ్రూప్ పునర వ్యవస్థీకరణలో భాగంగా కొలువుల కోత చేపట్టినట్లు కంపెనీ వెల్లడించింది.అమెజాన్‌టెక్ దిగ్గజం అమెజాన్ సైతం ఈ ఏడాది జనవరిలో ఫ్రెష్ లేఆఫ్స్ ప్రకటించింది. ప్రైమ్ వీడియో, ఎంజీఎం స్టూడియో డివిజన్స్‌లో ఉద్యోగులను తొలగించనున్నట్లు వెల్లడించింది. తన కీలక ప్రాధాన్యతలపై దృష్టి సారించడంతో పాటు ఆపరేషన్స్ క్రమబద్ధీకరణలో భాగంగా ఉద్యోగుల సంఖ్యను కుదించినట్లు పేర్కొంది.మెటాజిఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం మాతృసంస్థ మెటా ఈ ఏడాది ఆరంభంలోనే లేఆఫ్స్ ప్రకటించింది. టెక్నికల్ ప్రోగ్రాం మేనేజర్ విభాగంలో 60 మంది ఉద్యోగులపై మెటా వేటు వేసింది. కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది.డిస్కార్డ్‌జిఆన్‌లైన్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం డిస్కార్డ్ ఏడాది ఆరంభంలో లేఆఫ్స్‌కు తెగబడింది. కంపెనీ ఉద్యోగుల్లో 17 శాతం మంది ఉద్యోగులు 170 మందిని తొలగిస్తున్నామని డిస్కార్డ్ ప్రకటించింది. కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించే క్రమంలో సంక్లిష్ట నిర్ణయం తీసుకున్నామని డిస్కార్డ్ సీఈవో జాసన్ సిట్రన్ చెప్పారు.ట్విచ్‌జిఇక టెక్ దిగ్గజం అమెజాన్ కొనుగోలు చేసిన స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం ట్విచ్ సైతం లేఆఫ్స్ ప్రకటించింది. ఉద్యోగుల్లో 35 శాతం మందిని తప్పించనున్నట్టు వెల్లడించింది.పేపాల్..ఫైనాన్షియల్ టెక్నాలజీ దిగ్గజం పేపాల్ ప్రపంచవ్యాప్తంగా 9 శాతం ఉద్యోగులను తొలగించనున్నట్లు జనవరి చివర్లో ప్రకటించింది. కంపెనీ నిర్ణయంతో సుమారు 2,500 మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ మేరకు ఉద్యోగులకు కంపెనీ సీఈవో అలెక్స్ క్రిస్ లేఖ రాశారు. ఉద్యోగాలు కోల్పోతున్న వారికి ఈ వారాంతంలో సమాచారం అందజేస్తామని లేఖలో వెల్లడించారు. కంపెనీలో డూప్లికేషన్ తగ్గించడం, వనరులను సమర్థంగా వినియోగించడం, ఆటోమేషన్ వినియోగంతో సంక్లిష్టతలు తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అభివృద్ధికి అవకాశం ఉన్న విభాగాల్లో తమ పెట్టుబడులు కొనసాగిస్తామని ఈ సందర్భంగా క్రిస్ పేర్కొన్నారు.ఇవేకాదు.. ఇంకా చాలా సంస్థలు ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా ఇంటికి సాగనంపుతున్నాయి. కంపెనీ పునర్వ్యవస్థీకరణ, వ్యయ నియంత్రణ చర్యలు, ఆర్థిక మందగమనం పేరుతో వందలాది ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తున్నాయి. దీంతో టెకీల్లో లేఆఫ్స్ గుబులు మొదలైంది. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందోనన్న భయం మొదలైంది. ఏడాది ఆరంభంలోనే పలు విభాగాల్లో ఆయా కంపెనీలు పెద్దసంఖ్యలో ఉద్యోగులపై వేటు వేయడం ఆందోళన రేకెత్తిస్తోంది. రాబోయే రోజుల్లో మాస్ లేఆఫ్స్‌కు ఈ ట్రెండ్ సంకేతమని టెకీల్లో గుబులు రేగుతోంది.

# పబ్లిక్ ఇష్యూకు రానున్న హ్యుందాయ్..

## దేశంలోనే అతిపెద్ద ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌గా రికార్డు

**న్యూఢిల్లీ :** త్వరలో దేశీయ స్టాక్ మార్కెట్లలో ఓ బాహుబలి ఐపీవో రాబోతున్నది. దక్షిణ కొరియా ఆటో రంగ దిగ్గజం హ్యుందాయ్.. ఈ బంపర్ పబ్లిక్ ఇష్యూను భారతీయ ఈక్విటీ మార్కెట్లలోకి తేబోతున్నది. ఈ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా హ్యుం దాయ్ కనీసం 3 బిలియన్ డాలర్ల నిధులనైనా సమీకరించాలని చూస్తున్నది. మన దేశ కరెన్సీలో ఇది సుమారు రూ. 25,000 కోట్లు కావడం గమనార్హం. ఇప్పటిదాకా ఈ స్థాయిలో ఏ సంస్థ కూడా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి నిధులను సేకరించిన దాఖలాలు లేవు. దీంతో ఈ ఐపీవో వాస్తవ రూపం దాల్చితే భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డును సృష్టించనున్నది. ప్రస్తుతం ఈ రికార్డు ప్రభుత్వ రంగ




బీమా దిగ్గజం ఎల్ఐసీ పేరిట ఉన్నది. 2022లో వచ్చిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ పబ్లిక్ ఇష్యూ విలువ రూ.21,000 కోట్లు.ఏడాది ఆఖర్లో..ఈ ఏడాది ఆఖర్లో ఈ బడా పబ్లిక్ ఇష్యూను పట్టాలపైకి తీసుకురావాలని హ్యుందాయ్ భావి స్తున్నట్టు సమాచారం. ఐపీవో ద్వారా సంస్థలో 15-20 శాతం వాటాను విక్రయించేందుకు హ్యుందాయ్ కంపెనీ వర్గాలు యోచి స్తున్నట్టు సోమవారం తెలియవచ్చింది. ఈ వాటా అమ్మకంతో 3.3 బిలియన్ డాలర్ల నుంచి 5.6 బిలియన్ డాలర్ల వరకు నిధులను అందుకోవచ్చంటున్నారు. మరోవైపు దీనిపై కంపెనీ వర్గాలను సంప్రదించినా వారు స్పందించేందుకు నిరాకరించారు. కాగా, ప్రస్తుతం దేశీయ వాహన మార్కెట్‌లో మారుతీ సుజుకీ త ర్వాత హ్యుందాయ్‌దే రెండో స్థానం.

# ఆ కాల్పుల పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదే

## : ఇంద్రకరణ్‌రెడ్డి

**నిర్మల్:** దాదాపు 40 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా అంజయ్య ఉన్న సమయంలోనే ఇంద్రవెల్లి ఆదివాసులను బలి తీసుకున్నారని, నాటి ఇంద్రవెల్లి కాల్పుల పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీదేనని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అప్పట్లో సంచలనం సృష్టించిన ఇంద్రవెల్లి పోలీస్ కాల్పుల ఘటనను యావత్ భారతదేశం ముక్తకంఠంతో



ఖండించిందన్నారు. ఈ మారణకాండలో 250 మందికి పైగా ఆదివాసులు మరణించారన్నారు. గత చరిత్ర తెలియని ఇప్పటి కాంగ్రెస్ నేత, సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఇంద్రవెల్లిలో సభ నిర్వహించి అమరులకు నివాళులు అర్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఏనాడు ఆదివాసులను పట్టించుకున్న పాపాన పోలేదని, కేవలం గిరిజనుల ఓట్ల కోసమే ఇంద్రవెల్లిలో రేవంత్‌రెడ్డి సభ పెట్టారని ఆరోపించారు.కేసీఆర్ హయాంలోనే అభివృద్ధికేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన, ఆదివాసీ గూడేలు అభివృద్ధి చెందాయని ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అడవి బిడ్డల సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ సారథ్యంలోని గత ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. తండాలను, గూడేలను పంచాయతీలుగా మార్చి 'మా ఊళ్లో-మా రాజ్యం' చేశామన్నారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!

## 420 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



భారతీయ బెంచ్ మార్క్ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. గత సెషన్‌లో నష్టాలకు బ్రేక్ వేశాయి. ఉదయం సెన్సెక్స్ లాభాల్లో మొదలైంది. ప్రారంభంలో ఐటీ షేర్లు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. దీంతో మార్కెట్లు ము గిసే వరకు లాభాల్లోనే కొనసాగాయి. ఉదయం సెన్సెక్స్ 71,970.82 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 72,261.40 పాయింట్ల గరిష్ఠానికి చేరుకున్న సెన్సెక్స్ చివరకు 454.67 పాయింట్ల లాభంతో 72,186.09 వద్ద స్థిరపడన్నిఫ్టీ సైతం 21,900 పాయింట్ల ఎగువన స్థిరపడింది. నిఫ్టీ 157.70 పాయింట్లు లాభంతో 21,929.40 వద్ద ముగిసింది.ట్రేడింగ్‌లో దాదాపు 1,983 షేర్లు పెరిగాయి. 1,285 షేర్లు పతనమవగా.. 58 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో బీపీసీఎల్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, మారుతీ సుజుకీ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ నష్టపోయాయి. బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, పవర్ మినహా.. ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, మెటల్, ఐటీ ఒక్కొక్కటి ఒకటి నుంచి మూడుశాతం వృద్ధితో లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కోశాతం చొప్పున పెరిగాయి.

# కార్యాలయాలకు రాకుంటే కెరీర్ ఎదుగుదలకు బ్రేక్ : ఉద్యోగులకు డెల్ వార్నింగ్




ఉద్యోగులు వారానికి కనీసం మూడు రోజులు కార్యాలయాల్లో పని చేయాలని లేదంటే కెరీర్‌కు ఎదురుదెబ్బ తప్పదని డెల్ తమ సిబ్బం దిని హెచ్చరించింది. కరోనా మహమ్మారితో ఇతర టెక్ దిగ్గజాల తరహాలోనే డెల్ సైతం ఉద్యోగులకు రిమోట్ వర్క్ సదుపాయాన్ని కల్పించింది. ఉద్యోగుల్లో 60 శాతం మంది రోజూ ఇప్పటికీ ఇంటి నుంచి పనిచేస్తున్నారు.అయితే కరోనా నెమ్మదించడంతో కార్యాలయాలకు గంట సేపటిలో చేరుకునే దూరంలో ఉన్న ఉద్యోగులందరూ వారానికి కనీసం మూడు సార్లు ఆఫీస్‌కు రావాలని ఆదేశించింది. డెల్ ఆఫీసులతో వారు నివసించే ప్రాంతాలకు ఉన్న దూరంతో సంబంధం లేకుండా ఇప్పుడు అందరు ఉద్యోగులు వారానికి మూడు సార్లు కార్యాలయం నుంచి పనిచేయాల్సిందేనని తాజాగా స్పష్టం చేసింది.అయితే తక్కువ వేతనాలకు పనిచేసే కొందరు సిబ్బందికి పూర్తి కాలం రిమోట్ వర్క్ వెసులుబాటు కల్పించింది. ఇక హైబ్రిడ్ విధానంలో తాజా ఉత్తర్వులను ఉల్లంఘించిన వారికి కెరీర్ ఎదుగుదలలో ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొంది.

# 500 మంది ఉద్యోగులపై స్నాప్‌చాట్ వేటు




ప్రపంచవ్యాప్తంగా టెక్ రంగంలో లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. 2023లో టెక్ దిగ్గజాలతో పాటు స్టార్టప్‌లు సైతం ఎడాపెడా మాస్ లేఆఫ్స్‌కు తెగబడ్డాయి. ఇక కొత్త ఏడాది సైతం టెకీలపై లేఆఫ్స్ కత్తి వేలాడుతోంది. 2024లో అడుగుపెట్టామో లేదో తొలి మాసంలోనే వేల సంఖ్యలో ఉద్యోగులు కొలువులను కోల్పోయారు. తాజాగా ఈ ఏడాది రెండో మాసంలో ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ 'స్నాప్‌చాట్' మాతృ సంస్థ 'స్నాప్' ఫ్రెష్ లేఆఫ్స్ ప్రకటించింది వ్య యాల తగ్గింపు ప్రణాళికల్లో భాగంగా ఉద్యోగులను తగ్గించుకోవాలని నిర్ణయిం చింది.ఇందులో భాగంగానే గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం మందిని తొలగించనున్నట్టు ప్రకటించింది. సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఉద్యోగుల తొలగింపు విషయాన్ని వెల్లడించింది. కంపెనీకి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా పని చేస్తున్న ఫుల్‌టైమ్ ఉద్యోగుల్లో 10 శాతం మందిని తొలగించనున్నట్టు వెల్లడించింది. సంస్థలో 5,367 మంది ఫుల్‌టైమ్ ఉద్యోగులు ఉన్నారు. కంపెనీ తాజా నిర్ణయంతో 540 మంది ఉద్యోగులు కొలువుల్ని కోల్పోనున్నారు.ఇక స్నాప్‌తోపాటు ఓక్టా ఇన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కూడా ఈ నెల ప్రారంభంలోనే లేఆఫ్స్ ప్రకటించింది. కంపెనీ ఖర్చు లను తగ్గించుకోవడానికి సిబ్బందిలో ఏకంగా 7 శాతం మంది ఉద్యోగులను తొల గిస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీ నిర్ణయంతో 400 మంది ఉద్యోగులు కొలువులు కోల్పోనున్నారు.

# ఎండు కొబ్బరి తింటే ఎన్ని లాభాలో.. మరి మీరూ ట్రై చేయండి



ప్రకృతిలో సహజంగా లభించే పండ్లు, కూర గాయలతో ఎన్ని లాభాలు ఉన్నాయో అందరికీ తెలిసిందే. వాటిలో కొన్నింటిని చూస్తే కొందరు వాటి నుంచి దూరంగా ఉండ డమే వారికి ఇష్టం. కాని వాటి ఉపయోగం తెలిస్తే మాత్రం కచ్చితంగా వాటిని పాటించి ఆరోగ్యాన్ని పెంచుకోవాల్సిందేనని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అలసిన ప్రాణానికి బూస్టునిచ్చే కొబ్బరి నీళ్లే కాకుండా ఎండు కొబ్బరి కూడా అనేక ఉపయో గాలు ఉన్నా యి.ముఖ్యంగా ఎండుకొబ్బరిని ఉదయం వేళ ఖాళీ కడుపుతో తింటే అనారోగ్య సమ స్యలు దూరం అవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. ఎండు కొబ్బ రిలో యాంటీ ఆక్సి డెంట్ , మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, విటమిన్ బి వంటి విటమిన్లు దండిగా ఉం టాయి . ఫైబర్‌కూడా అధికంగా ఉండడం వల్ల జీర్ణ ప్రక్రియ మెరుగుకు ఎండు కొబ్బ రి ఎంతగానో సహాయ పడుతుంది .ఉదయమే ఇడ్లీ, వడ, ఉప్మా, పూరి బదులు అప్పు డప్పుడూ ఎండుకొబ్బరిని తినే అలవాటు చేసుకుంటే మె దడు గుండె పనితీరులో మార్పును గమనించవచ్చు.

# గంటా రాజీనామాకు ఆమోదం

**అమరావతి:** టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజీనామాను ఆమోదించినట్టు అసెంబ్లీ వేదికగా స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 2021 ఫిబ్రవరి 6న ఎమ్మెల్యే పదవికి గంటా రాజీనామా చేశారు. అయితే, ఆ రాజీనామాపై ఇంతకాలం ఎలాంటి చర్యలు తీసుకోని స్పీకర్ రెండు వారాల క్రితం ఆమోదించారు.తన రాజీనామాను ఆమోదించిన రోజు గంటా శ్రీనివాసరావు స్పందిస్తూ.. పవిత్రమైన ఆశయం కోసం తాను రాజీనామా చేశానని చెప్పారు. రాజీనామా తర్వాత స్పీకర్‌ను వ్యక్తిగతంగా పలు మార్లు కలిసి రాజీనామాను ఆమోదించాలని కోరినప్పటికీ? ఆయన ఆమోదించలేదని తెలిపారు. తన రాజీనామా లేఖను కోల్డ్ స్టోరేజ్ లో ఉంచిన స్పీకర్? ఇప్పుడు కుట్ర కోణంతో తనను అడగకుండానే ఆమోదించారని మండిపడ్డారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో రాజీనామాను ఆమోదించారని దుయ్యబట్టారు.

## జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా పెట్టడంతో ఉద్యమ కళాకారుల హర్షం



**కొమురవెల్లి** ::తెలంగాణ రాష్ట్ర గీతంగా జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం అంటూ తెలంగాణ యావత్ జనాన్ని ఉద్యమ స్ఫూర్తిని రగిలించి దీప్తినందించిన స్ఫూర్తిదాయకమైన గీతాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం తెలంగాణ కవులను కళాకారులను గౌరవించినట్లేనని తెలంగాణ ఉద్యమ గాయకుడు సాంస్కృతిక సారధి కళాకారుడు పిన్నింటి రత్నం హర్షం వ్యక్తం చేశారు,ఈ సందర్భంగా కొమురవెల్లి మండల కేంద్రంలో పిన్నింటి రత్నం మాట్లాడుతూ, గీత రచయిత ప్రజాకవి ప్రజా వాగ్గేయ కారులు లోక కవి డాక్టర్ అందెశ్రీ గారు నాడు ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజా అభిప్రాయాన్ని తన కలం గళం ద్వారా తెలంగాణ ప్రజలను ఏకతాటిపై తెచ్చి చైతన్య%శీ% నింపిన ఘనత అందెశ్రీ గారికే దక్కుతుందని అన్నారు,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మంత్రివర్గానికి కవుల కళాకారుల పక్షాన ధన్యవాదములు తెలియజేసారు,ఈ కార్యక్రమంలో కళాకారులు గట్టగల్ల సంజీవ,జనగామ శంకర్,బానోత్ గణేష్,కేమిడి కనుకరాజు,పన్నీరు శ్రీనివాస్,కారుపోతుల సోమయ్య,చందు తదితరులు పాల్గొన్నారు.

## ఖబడ్దార్ బాల్కన్ సుమన్

### ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత నీకు లేదు



**జూలూరుపాడు ఫిబ్రవరి,06**: వైరా నియోజకవర్గ%శీ% జూలూరుపాడు మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాచేశారు ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, బిఆర్ఎస్ నాయకుడు బాల్కన్ సుమన్ మాట్లాడే బాష తీరు మారకపోతే ప్రజలే తగిన బుద్ధి చెపుతారని, బాల్కన్ సుమన్ వ్యవహారాలు చూసి త్వరలో జరగబోవు పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతామని బయంతో.ఏంమాట్లాడుతున్నారో. అర్థం కాని పరిస్థితి బిఆర్ఎస్ నాయకులదని..ఇప్పటికైనా పద్ధతులు మార్చుకొని ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలి హితవు పలికారు ఈ కార్యక్రమంలో, వైరా నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చాపలమడుగు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంశెట్టి రాంబాబు, ఓబీసీ సెల్ మండల ప్రెసిడెంట్ గోపురామకృష్ణ, కిసాన్ సెల్ మండల ప్రెసిడెంట్ తాళ్లూరు అచ్చయ్య, భూక్యా ప్రసాద్, బాధవత్ బాల తదితరులు పాల్గొన్నారు..

### కరీమాబాద్ బొడ్రాయి కమిటీ సభ్యులు వరంగల్ సిటీ ఏ.సి.పి. బోనాల కిషన్ గారిని మరియు ట్రాఫిక్ సిఐ వెంకన్న గార్లను మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 12,13,14,బొడ్రాయి ఉత్సవాలకురావాల్సింగా ఆహ్వానించారు





వరంగల్ సిటీ న్యూస్ ఫిబ్రవరి 6 ఏ.సీ.పి. బోనాల కిషన్ గారు స్పాన్ కులంగా స్పందించి ట్రాఫిక్ సమస్య లాండర్ సమస్యను చూసుకుంటామని హామీ ఇచ్చినారు ఈ కార్యక్రమంలో కొమ్మిని రాజేందర్. ఓగిలిశెట్టి అనిల్ కుమార్. మేడిది మధుసూదన్. నాగపురి సంజయ్ బాబు వెళిదే శివమూర్తి. కొమ్మిని సురేష్. కోరే కృష్ణ. గోనే రాంప్రసాద్. బత్తిని రంజిత్. పౌడల సంపత్. షేర్ల శ్రీధర్. సుంకరి సంజీవ్. కస్తూరి వంశీ . పూజారి అజయ్. పూజారి సందీప్. నాగపురి సంతోష్. ఓగిలిశెట్టి రాఘవ. బత్తిని అఖిల్. మోడం రాజశేఖర్ బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

### ఆపదలో ఉన్నవారికి రెండు యూనిట్ల ఎర్ర రక్త కణాలు దానం చేసిన రూప్సేన్ ,మరియు మహాత్మ జ్యోతిబాపూలే పీటి. సాగర్ ఆపదలో మేమున్నాం అంటున్న బ్లడ్ డొనర్స్ గ్రూప్ అండ్ టీం.బైంసా...







పేషెంట్ నేమ్ దీపక్ వయసు 73 సంవత్సరాలు గ్రామము బైంసా . జిడిఆర్ హాస్పిటల్ లో ఎర్ర రక్త కణాలు బాగా తక్కువ అవడం వలన డాక్టర్ సుమల మేడం చెప్పగానే ఓ పాజిటివ్ రెండు యూనిట్ల ఎర్ర రక్త కణాలు అవసరం ఉండగా ఫోన్ చేసిన వెంటనే సమాజం కోసం నా వంతు సహాయం చేస్తానని స్పందించి జీవన్దాన్ రక్తనిధి కేంద్రానికి వచ్చి తన అమూల్యమైన ఎర్ర రక్త కణాలు దానం చేసి మానవత్వం చాటుకున్నారు . ఎర్ర రక్త కణాలు దానం చేసిన రూప్సేన్ కు మరియు మహాత్మ జ్యోతిబాపూలే పిటి సాగర్ కి ప్రత్యేక ధన్యవాదములు. ఇలాగానే ప్రతి ఒక్కరు ముందుకు రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో సచిన్, విశాల్, సురేష్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది గోపి పాల్గొన్నారు. ఆపదలో మేమున్నాం అంటున్న బ్లడ్ డోనర్స్ గ్రూప్ అండ్ టీం బైంసా

## మణుగూరు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం



**మణుగూరు ఫిబ్రవరి 6**

మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు దగ్ధం చేయడం జరిగింది ఈ సందర్భంగా మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కురం వీరన్న మాట్లాడుతూ మా ప్రియతమ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పై చెప్పు చూపిస్తూ బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు బిఆర్ఎస్ నాయకులను ప్రజలు రాష్ట్రంలో ఓడించిన కూడా బుద్ధి రాలేదని వారు ఒళ్ళు దగ్గర పెట్టుకొని పద్ధతిగా మాట్లాడకుంటే యువజన కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని మీ నాలుకలు చీరేస్తారని హెచ్చరించారుఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీరినాకి నవీన్ , పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శివ సైదులు, పట్టణ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురం రవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బానోతు లక్ష్మణ్ ,మణుగూరు మండల వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు,నాయకులు వెలగపల్లి జాన్, సామ శ్రీనివాస్ రెడ్డి ,మాజీ ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్ , తోగ్గూడెం మాజీ ఉప సర్పంచ్ వీరంకి వెంకట్రావు గౌడ్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు , ఎంకేఎం రాజు, సారంపల్లి రామిరెడ్డి ,పుట్టి నారాయణ, , ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుగొండ సాంబశివరావు, మణుగూరు మండల బీసీ సెల్ అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంభం అంజయ్య,పాల్వంచ శ్రీను,%ాఖ% అబ్దుల్లా ,గాండ్ల సురేష్ యువజన నాయకులు ,చింతల కృష్ణ, సూర రాజు, జర్పుల జగన్,పల్లం నాగేశ్వరరావు,దాసరి లింగయ్య, బాగం. రవి,పినపాక మండల %ర% సెల్ అధ్యక్షులు చిన్న బుజ్జిబాబు యూత్ కాంగ్రెస్ నాయకులు,గడదాసు శంకర్ , రోండా శ్రీకాంత్, సాయి, రామకృష్ణ, గుండె మధు,మహిళా కాంగ్రెస్ నాయకులు
ఆముదాల శ్యామల, ఉప్పాడి అనిత తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రియాంక గాంధీ రావడం ఖాయం

**హుస్నాబాద్ రూరల్ ఫిబ్రవరి5** ప్రియాంక గాంధీ గారు తెలంగాణకు వస్తది అని తెలియగానే ఎమ్మెల్సీ కవిత గారు ఏ హోదాలో వస్తుంది ఆమె వచ్చిన రోజు నల్ల బెలూన్లు ఎగరవేస్తామని మాట్లాడిన కవిత గారు శ్రీ భద్రాది రామయ్య గారి కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు గారి మనవడు పట్టు వస్త్రాలు తలంబ్రాలు తీసుకువెళ్లడం జరిగినది ఏ హోదాతో తీసుకువెళ్లాడు మీరు చెప్పాల్సిన అవసరం ఉంది



తెలంగాణ ప్రజానీకానికి అలాగే హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు గారు బిజెపి కాంగ్రెస్ రెండూ ఒకటే అని మాట్లాడడం జరిగినది దానికి సంబంధించిన ప్రూఫ్స్ ఏమన్నా ఉంటే చూపించాలి గతంలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన బిజెపికి ఎన్ని ఓట్లు వచ్చినాయి ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే బిజెపికి ఎన్ని ఓట్లు వచ్చినాయో తెలుసుకోనీ మాట్లాడాలి సెక్రెటరీలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మాజీ ఎమ్మెల్యే కుమారుడైన మాజీ మార్కెపేడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి గారు కలవగానే ఓటమిని తట్టుకోలేక మాట్లాడిన మాటలు మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు గారు కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయంలో వివిధ పార్టీల నాయకులు అందరూ కలిసి వీరభద్ర స్వామి దర్శనం చేసుకున్నారు మరి దాన్నేమంటారో ఒకసారి మీరు ఆలోచన చేయాలి అలాగే గత ప్రభుత్వంలో నీటి వనరులపై జరిగిన అవినీతిపై రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ దాన్ని తప్పుగా భావిస్తున్న బిఆర్ఎస్ నాయకులు బిఆర్ఎస్ ప్రభుత్వంలో వారు మాట్లాడిన మాటలు కన్నా ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడినవి తక్కువే అని ప్రజలనుకుంటున్నారు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు మున్సిపల్ కౌన్సిలర్ వల్లపు రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు వెన్నరాజు సంఘ కుమార్ తదితరులు పాల్గొన్నారు

### విజయ సాయి రెడ్డి పై ఫిర్యాదు చేసిన జనగామ డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి



**జనగామ:** ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం కూలిపోతుందని వ్యాఖ్యలపై విజయసాయిరెడ్డి పై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారు.... ఫిర్యాదు ని డీసీపీ గారికి అందించిన జనగామ జిల్లా ముఖ్య నాయకులు పిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, లీగల్ సెల్ సెక్రటరీ ఆలేటి సిద్ధి రాములు,మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ ,పట్టణ మాజీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి,వేమళ్ళ సత్యనారాయణ రెడ్డి,%ంఎ% సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ,మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా కృష్ణస్వామి, పట్టణ మహిళా అధ్యక్షురాలు కౌన్సిలర్ జక్కుల అనిత వేణు,బొట్ల నర్సింగరావు, లింగాల నర్సిరెడ్డి ,నూకల బాల్ రెడ్డి,అండాలు, మున్ని బేగం,తోట లావణ్య,బృంగి భాస్కర్, మచ్చ ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ మంగసత్యం,గంధమల్ల కమలాకర్, జనార్ధన్, గాజే అనిల్,లింగాల వెంకట రాం రెడ్డి,వంగపల్లి శ్యామ్,మిద్దెపాక స్టాలిన్, పాల్గొన్నారు.

### అఖిల భారత యువజన సమాఖ్య క్యాలెండర్ను ఆవిష్కరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శేషగిరి భవన్ లో మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ఏఐవైఎఫ్ 2024 క్యాలెండర్ను ఆవిష్కరించారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యమాల బాటలో నడవాలని ఈ దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపై యువత మేల్కొని ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని స్థానిక సమస్యలపై పోరాడాలని సమాజంలో యువతే మార్గదర్శకులుగా ఉండాలని సాబీర్ పాషా పిలుపునిచ్చారుయువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి వ్యాయామాలు క్రీడల ద్వారా ఆరోగ్యానికి మంచి ప్రాధాన్యత ఇచ్చి ఆరోగ్యవంతులుగా ఉండి ఈ సమాజాన్ని మంచి మార్గంలో నడిపించే దాంట్లో ప్రధాన పాత్ర పోషించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా,ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె ఖయ్యూం, ఏఐవైఎఫ్ నాయకులు చాంద్ పాషా,సతీష్, వినోద్, సంతోష్, చింటూ,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర రాష్ట్ర దొంగలు అరెస్టు, రిమాండ్



**అన్నపురెడ్డిపల్లి ఫిబ్రవరి 6** గత నెల జనవరి 16వ తారీఖు న కొందరు వ్యక్తులు ఒక కారులో వచ్చి ఎర్రగుంట గ్రామంలో గల ఒక షాపు ముందు బయట పార్క్ చేసి ఉన్న రాయల్ ఇన్ ఫీల్డ్ బుల్లెట్ బైక్ ను దొంగలించుటకు ప్రయత్నం చేయగా నైట్ బీట్ డ్యూటీలో ఉన్న పోలీసులు వారిని గమనించి పట్టుకోవటానికి ప్రయత్నించగా వారు కారు వదిలి పారిపోయారు, పోలీస్ సిబ్బంది
ఫిర్యాదు మేరకు దీనిపై ఎస్సై షాహిన కేసు నమోదు చేశారు. కాగా మంగళవారం ఎస్సై తన సిబ్బందితో కలిసి మహబూబ్నగర్. గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ఎపి 39 సి జెడ్ 5565 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై ఎర్రగుంట వైపు వస్తుండగా వారిని గుర్తుపట్టిన పోలీస్ సిబ్బంది వారిని అదుపులోనికి తీసుకొని విచారించగా
1) .మన్నేపల్లి పవన్ కుమార్ తండ్రి పేరు హనుమంతరావు, వయసు 23 సంవత్సరాలు , కులం కమ్మ, వృత్తి, బీటెక్ విద్యార్థి ఆర్వో సాతులూరు గ్రామం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్, 2) సయ్యద్ షరీఫ్ మున్నా,తండ్రి పేరు బాజీ, వయస్సు 25 సంవత్సరాలు, కులం ముస్లిం, వృత్తి సెక్యూరిటీ గార్డ్ యూనివర్సల్ కాలేజ్, పేరంచర్ల ఆర్వో సాతులూరు గ్రామం, నాదెండ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ అని తెలిసిందని వీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో చాలా దొంగతనాలు చేశారని, పలు పోలీస్ స్టేషన్లలో వీరిపై అనేక కేసులు నమోదయ్యాయని వీరితోపాటు మరొక ముగ్గురు వ్యక్తులు 1.సుభాని, 2.వీరయ్య, 3.అష్రఫ్ లు ఉన్నారని వీరంతా కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి పలుచోట్ల అనేక దొంగతనాలు చేస్తున్నారని. ప్రస్తుతం వీరి ముగ్గురు పరారీలో ఉన్నారని. కాగా మంగళవారం వీరిద్దరూ వదిలి పెట్టిన కారుని ఎలాగైనా తీసుకుపోవాలి అనే ఉద్దేశంతో మరల నరసాపురం నుంచి ఎర్రగుంట కు వస్తుండగా ఈ ఇద్దరిని గుర్తుపట్టిన పోలీస్ సిబ్బంది వీరిని అరెస్టు చేసి కొత్తగూడెం జె ఎఫ్ సి ఎం కోర్టు నందు హాజరు పరిచామని ఎస్సై ఎస్డి షాహినా తెలియజేశారు.

### పెండింగ్ ప్రభుత్వ భూముల సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆఫీస్ లోనీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కి పిటిషన్ ఇచ్చిన మద్దిశెట్టి



**కొత్తగూడెం: ఫిబ్రవరి, 06**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ మద్దిశెట్టి సామెలు అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మెమోరాండాలు అందజేయడం జరిగింది. ప్రధానంగా జగ్గారం, చింతిర్యాల గూడెం గ్రామల పరిధిలోని సర్వే నంబర్ 400, 400/2, 191/1,192/2 గౌరవ హైకోర్టు ఆదేశాల ప్రకారం జాయింట్ సర్వే నిర్వహించాలని గత 5 ఏళ్లుగా ఉన్న భూమి సమస్యలని పరిష్కరించాలని మెమోరాండం ఇవ్వడం జరిగింది. అదే విధంగా ఇల్లెందు మండలానికి సంబంధించి సర్వే నంబర్ 618 లోని ప్రభుత్వ భూమిపై సర్వే నిర్వహించి ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, అదే విధంగా జూలూరుపాడు మండలం
లోని సూరారం వెంగన్నపాలెం గ్రామాలకు చెందిన అసైన్మెంట్ పట్టాలు రానటువంటి వారికి పట్టాలు మంజూరు చేయాలని, అదే విధంగా దమ్మపేట మండలంలో భూదాన భూములపై పట్టాలు ఇవ్వాలని పలు సమస్యలపై మెమోరాండాలు ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో గుగులోత్ రమేష్ నాయక్, గుగులోత్ నాగేశ్వరావు నాయక్, రాజులపాటి ఐలయ్య, ముక్తి మల్లెష్, రచ్చ సుజాత, కిన్నెర రామకృష్ణ, ధనసరి సారమ్మ, కోడెం సీతాకుమారి, కుదురుపాక నిర్మల, మాలోత్ మాంగిణి, స్వరూప, బొర్రా రామలక్ష్మి, ఊకే చిట్టెమ్మ, ఊకే సాయి, నరసింహారావు, కొంద్రు ముత్తయ్య, కాక ముత్తమ్మ, పాయం భద్రయ్య, ఊకే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కబరస్థానం స్థలం కబ్జా..!

### అగ్రహిస్తున్న ముస్లిం కులస్తులు..!!

### స్థానిక తాసిల్దార్ విచారణ చేపట్టాలి...!!!







**పినపాక: ఫిబ్రవరి, 06** .పినపాక మండల కేంద్రంలోని చెరువు శివారులో ప్రభుత్వ భూమి 512/1 సర్వే నెంబర్లు 2.05 గుంటల భూమిని గతంలో అధికారులు ప్రభుత్వం స్థలాన్ని ముస్లిం కులస్తులకు సర్వే నిర్వహించి కబరస్థానం కేటాయించారు. ఈ భూమిని కొందరు కబ్జా చేసి పంట వేస్తూ సాగు చేస్తున్నారు. దీంతో ముస్లిం కులస్తులు మరణించినప్పుడు స్థలం లేక ఇబ్బందుల గురవుతున్నామని ముస్లిం కులస్తులు అగ్రహిస్తున్నారు. స్థానిక రెవిన్యూ అధికారులు ఈ స్థలంపై విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.కబరస్థానం కబ్జా దుర్మార్గం: పినపాక కాంగ్రెస్ మైనార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ దస్తగిరిమండల కేంద్రంలోని కభరస్థానం కబ్జా చేయడం దుర్మార్గం మనీ కాంగ్రెస్ పార్టీ పినపాక గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ దస్తగిరి అన్నారు. ప్రభుత్వం ముస్లింలకు 512/1 సర్వే నెంబర్లు 2.05 గుంటల భూమిని. పినపాక చెరువు శివారులో ఆనాడు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ముస్లిం సోదరులకు ఇచ్చిన స్థలాన్ని కొందరు కబ్జా చేసి సాగు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి ముస్లిం సోదరులకు న్యాయం చేయాలని కోరుచున్నారు.కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి: మైనార్టీ నాయకుడు సైద్ మామ్
పినపాక చెరువు కింద కబ్జా అయిన స్థలాన్ని అధికారులు చర్యలు చేపట్టి కబరస్థానం స్థలాన్ని ముస్లింలకు అప్పగించాలని పినపాక గ్రామ మైనార్టీ నాయకుడు కోరారు. కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని కోరారు.

## ఒలిపింక్ విజేతకు ఊహించని షాక్..

# తొలి మ్యాచ్‌లోనే అనర్హతకు గురైన లొవ్లీనా




బల్గేరియాలో జరుగుతున్న 75వ స్ట్రాండ్‌జా మెమోరియల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత స్టార్ బాక్సర్ లొవ్లీనా బొర్గొహైన్ ఊహించని షాక్ తగిలింది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ఆమె అనర్హతకు గురైంది. టోక్యో ఒలింపిక్స్ కాం స్య పతకంతో మెరిసిన లొవ్లీనా 75 కిలోల విభాగంలో ఐర్లాండ్‌కు చెందిన ఒ రూర్క్ అఫీతో పోటీ పడింది. అయితే.. అదనపు గ్రిప్పింగ్ ఉపయోగించినందుకు మూడోసారి వార్నింగ్ ఇచ్చిన రిఫరీలు చివరకు మూడో రౌండ్‌లో ఆమెను డిస్‌క్వాలిఫై చేశారు.ప్యారిస్ ఒలింపిక్స్ బెర్తుపై కన్నేసిన లొవ్లీనా మొదటి రెండు రౌండ్లలో 3-2తో ఆధిక్యంలో ఉంది. అయితే.. ఆ తర్వాత ఐర్లాండ్ బాక్సర్ రూర్కే పంచ్‌లతో భారత బాక్సర్‌పై విరుచుకుపడింది. ఆమెను నిలువరించేందుకు లొవ్లీనా గట్టిగానే ప్రయత్నించింది. బౌట్ ఆసాంతం రూర్కేపై పంచ్‌లు కురిపించింది.కానీ, మూడు హెచ్చరికల కారణంగా చివరకు రిఫరీలు ఆమెను అనర్హురాలిగా ప్రకటించారు. మరోవైపు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్(50 కేజీ), సాక్షి చౌదరీ(57 కిలీలు) తొలి రౌండ్‌లో విజయం సాధించారు. నిఖత్ 3-2తో మంగోలియా బాక్సర్ ఒయున్‌ట్సేట్సెగ్ యెషుగెన్‌ను చిత్తు చేసింది.

## వైభవంగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ పెండ్లి..

# ఫొటోలు వైరల్






బీ పాకిస్థాన్ క్రికెట్‌లో పెండ్లి బాజాలు మోగుతూనే ఉన్నాయి. ఈ మధ్యే మాజీ ఆల్‌రౌండర్ షోయబ్ మాలిక్‌మూడో వివాహంతో వార్తల్లో నిలవగా.. తాజాగా మహిళల జట్టు మాజీ కెప్టెన్ జవేరియా ఖాన్ పెండ్లి చేసుకుంది. ఆదివారం కరాచీలో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జవేరియా, వకాస్ వివాహం వైభవంగా జరిగింది.జవేరియా నిఖాకు మాజీ కెప్టెన్ సనా మిర్ అయేషా జాఫర్ హాజరయ్యారు. తన పెండ్లి పెండ్లి వేడుక ఫొటోలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఆల్‌రౌండర్ అయిన జవేరియా 2008లో శ్రీలంకపై వన్డేల్లో అర ంగేట్రం చేసింది. పదేండ్ల సుదీర్ఘ కెరీర్‌లో 116 వన్డేలు, 112 టీ20లు ఆడింది.వన్డేల్లో 2,8 85 రన్స్, పొట్టి ఫార్మాట్‌లో 2,018 పరుగులు చేసింది. ఆమె ఖాతాలో రెండు సెంచరీలు, 25 అర్ధ శతకాలు ఉన్నాయి. అంతేకాదు 17 వన్డేలు, 16 టీ20ల్లో పాక్ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించింది. కెరీర్ సాఫీగా సాగుతుండగానే 2022లో వన్డేలకు జవేరియా వీడ్కోలు పలికింది. ఇక పొట్టి ఫార్మాట్‌లో నిరుడు ఆఖరి మ్యాచ్ ఆడేసింది.

# దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్..

## టాస్ గెలిచిన భారత్



అండర్ 19 ప్రపంచకప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత జటు కీలక మ్యాచ్‌కు సిద్ధమైంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన దక్షిణాఫ్రికా సెమీఫైనల్లో తలపడుతోంది. విల్లో మూరె పార్క్‌లో జరుగుతున్న పోరులో టాస్ గెలిచిన భారత కెప్టెన్ ఉదయ్ సహరన్ బౌలింగ్ తీసుకున్నాడు. టీమిండియా ఏ మార్పులు లేకుండా బరిలోకి దిగుతుండగా.. ప్రొటిస్ జట్టు ఒక్క మార్పుతో ఆడుతోంది.భారత జట్టు : ఆదర్శ్ సింగ్, అర్షిన్ కులకర్ణి, ముషీర్ ఖాన్, ఉదయ్ సహరన్(కెప్టెన్), ప్రియాన్షు మోలియా, సచిన్ ధాస్, అరవెల్లి అవినాష్(వికెట్ కీపర్), మురుగన్ అభిషేక్, రాజ్ లింబానీ, నమన్ తివారీ, సౌమీ పాండే.దక్షిణాఫ్రికా జట్టు : లుమాన్ డ్రె ప్రిటోరియస్(వికెట్ కీపర్), స్టీవ్ స్టోల్క్, డేవిడ్ టీగర్, రిచర్డ్ సెలెట్స్‌వనే, డెవాన్ మరైస్, జువాన్ జేమ్స్(కెప్టెన్), ఒలివర్ వైట్‌హెడ్, రిలే నోర్టన్, ట్రిస్టన్ లూస్, కొబని మొకీన, క్వెనా మఫాకా.డిఫెండింగ్ చాంపియన్‌గా టోర్నీలో అడుగుపెట్టిన భారత్ లీగ్ దశలో ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. కుర్రాళ్లు ముషీర్, ఉదయ్, కులకర్ణిలు శతకాలతో జోరు కొనసాగిస్తున్నారు. దాంతో, వరుసగా రెండో సారి ట్రోఫీ గెలవాలనే కసితో ఉంది. మరోవైపు సొంతగడ్డపై దక్షిణాఫ్రికాను తక్కువ అంచనా వేస్తే భారీ మూల్యం చెల్లించుకున్నట్టే. ఆ జట్టు పేసర్ క్వెనా మఫాకా భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే అతడు 18 వికెట్లు పడగొట్టాడు. అందులో మూడు ఐదు వికెట్ల ప్రదర్శనలు ఉన్నాయి.


# మూడో వన్డేలో విండీస్ విలవిల..

## 3-0తో సిరీస్ నెగ్గిన ఆసీస్




గబ్బా టెస్టులో వెస్టిండీస్ చేతిలో చావుదెబ్బ తిన్న ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. మూడు వన్డే (ల్లోనూ కరీబీయన్ జట్టును చిత్తు చిత్తుగా ఓడించింది. మంగళ`వారం మనుకా ఓవల్ స్టేడియంలో జరిగిన మూడో వన్డేలో అద్భుత విజయంతో విండీస్‌ను వైట్‌వాష్ చేసింది. ఆస్ట్రేలియా గడ్డపై అతి తక్కువ ఓవర్లలో ఫలితం తేలిన మొదటి వన్డే ఇదే. అంతర్జాతీయంగా చూస్తే.. తక్కువ ఓవర్లలోనే ముగిసిన ఆరో మ్యాచ్ కావడం విశేషం.తొలుత షాయ్ హొప్ బృందాన్ని ఆసీస్ బౌలర్లు 86 పరుగులకే కట్టడి చేయగా.. స్వల్ప లక్ష్యాన్ని కంగా రు జట్టు 7 ఓవర్లలోనే ఛేదించింది. అరంగేట్రం సిరీస్‌లోనే అద్భుతంగా రాణించిన గ్జావియ్ బార్ట్‌లెట్'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు గెలుచు కున్నాడు.తొలి రెండు వన్డేల్లో ఆకట్టుకోని వెస్టిండీస్ మూడో వన్డేలో మరీ దారుణంగా ఓడింది. ఆసీస్ యువ పేసర్ గ్జావియ్ బార్ట్‌లెట్ నిప్పులు చెరగడంతో టాపార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. స్పిన్నర్ ఆడం జంపా కూడా ఓ చేయి వేయడంతో పర్యాటక జట్టు 86 పరుగులకే ఆలౌటయ్యింది.

# గుజరాత్ జెయింట్స్‌కు కొత్త హెడ్‌కోచ్..



మరికొద్దిరోజుల్లో ఢిల్లీ, బెంగళూరు వేదికలుగా జరుగబోయే ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో ప్రముఖ వ్యాపారవేత్త గౌతం అదానీ ఆధ్వర్యంలోని గుజరాత్ జెయింట్స్ జట్టు కొత్త హెడ్‌కోచ్‌తో బరిలోకి దిగబోతోంది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు మైఖెల్ క్లింగర్‌కు ఆ జట్టు హెడ్‌కోచ్ బాధ్యతలు అప్పజెప్పింది. గత సీజన్‌లో గుజరాత్ జెయింట్స్‌కు రేచల్ హేన్స్ హెడ్‌కోచ్‌గా వ్యవహరించింది. కానీ గత సీజన్‌లో ఆ జట్టు దారుణ వైఫల్యాలతో పాయింట్లపట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచిన విషయం విదితమే.ఆస్ట్రేలియా జాతీయ జట్టు తరఫున అవకాశాలు దక్కించుకోకపోయినా దేశవాళీ క్రికెట్‌లో మాత్రం పరుగుల వరద పారించాడు. 182 ఫస్ట్ క్లాస్ గేమ్స్‌లో క్లింగర్.. 11,320 పరుగులు చేశాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో 7,449 పరుగులు చేయగా, టీ20 కెరీర్‌లో 5,960 రన్స్ చేశాడు. జాతీయ జట్టు తరఫున అవకాశాలు దక్కించుకోలేకపోయిన క్లింగర్.. ఆసీస్ తరఫున మూడు టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు.అంతర్జాతీయ క్రికెట్‌లో అంతగా పరిచయం లేని క్లింగర్.. బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో మెల్‌బోర్న్ రెనెగ్రేడ్స్ కు రెండు సీజన్ల పాటు హెడ్‌కోచ్‌గా వ్యవహరించాడు. అంతకుముందు ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్‌లో సిడ్నీ థండర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేశాడు. హెడ్‌కోచ్‌గా క్లింగర్ బాధ్యతలు చేపట్టబోతున్న గుజరాత్ జెయింట్స్ జట్టుకు మెంటార్‌గా మిథాలీ రాజ్ ఉండగా నూషిమ్ అల్ ఖాదిల్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరిస్తోంది. మహిళల ప్రీమియర్ లీగ్ రెండో సీజన్ ఫిబ్రవరి 23 నుంచి మొదలుకానున్న విషయం తెలిసిందే. గుజరాత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 25న డిఫెండింగ్ ఛాంపియన్స్ ముంబై ఇండియన్స్‌తో ఆడనుంది.

# బజ్‌బాల్ ఒక అట్టర్‌ప్లాఫ్ ఫార్ములా..

## ఇంగ్లండ్‌పై మాజీ దిగ్గజం విమర్శలు



భారత పర్యటనలో భాగంగా వైజాగ్ వేదికగా సోమవారం ముగిసిన రెండో టెస్టులో నాలుగో ఇన్నింగ్స్‌లో 399 పరుగుల ఛేదనలో 292 పరుగులకే ఆలౌట్ అయి భారీ పరాభవాన్ని మూటగట్టుకుంది. గడిచిన రెండేండ్లుగా బజ్‌బాల్ ఆటతో స్వదేశంతో పాటు విదేశాల్లోనూ మెరుపులు మెరిపిస్తున్న ఆ జట్టు.. భారత్‌లో కూడా అదే దూకుడును ప్రదర్శిస్తున్నది. హైదరాబాద్ టెస్టులో అద్భుత ఆటతో నెగ్గిన ఆ జట్టు వైజాగ్‌లో మాత్రం ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయింది. విశాఖపట్నంలో బెన్ స్టోక్స్ సేన ఓటమితో ఇంగ్లండ్ దిగ్గజ ఆటగాడు జెఫ్రీ బాయ్‌కాట్.. ఇంగ్లీష్ టీమ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బజ్‌బాల్ అనేది ఓ అట్టర్ ప్లాఫ్ అని ఇదే ఆటతీరుతో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన యాషెస్ సిరీస్‌లో ఓడినా ఆ జట్టు గుణపాఠం నేర్చుకోలేదని బాయ్‌కాట్ ఘాటుగా స్పందించాడు.వైజాగ్ టెస్టు తర్వాత టెలిగ్రాఫ్‌కు రాసిన ఓ వ్యాసంలో బాయ్‌కాట్ స్పందిస్తూ 'హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్, కెప్టెన్ బెన్ స్టోక్స్‌లు ఎప్పుడూ దూకుడు దూకుడు దూకుడు అని పరితపిస్తున్నారు. టెస్టులను జనరంజకం చేస్తున్నామని చెప్పుకుంటున్న వాళ్లు కొన్ని మ్యాచ్‌లు ఓడిపోయినా ఫర్వాలేదని అంటున్నారు. కానీ ఓడిపోతే కీర్తి ఎలా వస్తుంది..? బజ్‌బాల్ ఆటతీరు గొప్ప ఎంటర్‌టైనరే కావొచ్చు. కానీ అన్ని సందర్బాల్లో అదే ఆట కుదరదు. ఇవాళ ఇంగ్లండ్ మ్యాచ్‌ను వదిలేసింది. బజ్‌బాల్ ఒక ఫెయిల్యూర్ అని మరోసారి నిరూపితమైంది..'అని పేర్కొన్నాడు. గతేడాది యాషెస్ సందర్భంగా బాయ్‌కాట్ ఇంగ్లండ్ టీమ్‌పై ఇవే తరహా వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. బజ్‌బాల్ ఆటతీరుపై ఆయన మొదట్నుంచీ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు.రెండో టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో 400 పరుగుల ఛేదనలో కనీసం ఒక్క బ్యాటర్ అయినా సెంచరీ కంటే ఎక్కువ పరుగులు చేసి ఉండాల్సిందని కానీ ఇంగ్లండ్ మాత్రం అలా చేయక మూల్యం చెల్లించుకుందని బాయ్‌కాట్ వివరించాడు. బజ్‌బాల్ మాయలో పడ్డ ఇంగ్లండ్ కామన్‌సెన్స్‌తో ఆడటం మరిచి పోయిందని, ఎప్పుడు అటాక్ చేయాలో ఎప్పుడు డిఫెండ్ చేయాలనేది టెస్టులలో కీలకమని బాయ్‌కాట్ రాసుకొచ్చాడు.ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ గెలవగా వైజాగ్ టెస్టులో భారత్ గెలిచింది. తద్వారా సిరీస్‌ను 1-1 తో సమం చేసింది. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు ఈనెల 15 నుంచి రాజ్‌కోట్ వేదికగా మొదలుకానుంది.

# వెయ్యో వన్డేలో విండీస్‌ను

# చిత్తు చేసిన ఆసీస్.. రికార్డు విజయం




సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను కంగారూలు 3-0 తేడాతో క్వీన్ స్వీప్ చేశారు. రెండో వన్డేలో కాస్త ప్రతిఘటించినా కరేబియన్ జట్టు మూడో వన్డేలో మాత్రం పూర్తిగా తేలిపోయింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో విఫలమై కాన్‌బెర్రా వేదికగా ముగిసిన మూడో వన్డేలో ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఈ విజయం ద్వారా ఆస్ట్రేలియా రికార్డుల హోరెత్తించింది. విండీస్ నిర్దేశించిన 87 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్.. 6.5 ఓవర్లలోనే దంచి కొట్టింది. ఆసీస్‌కు బంతులపరంగా ఇదే అతిపెద్ద విజయం.ఆసీస్‌కు వన్డేలలో ఇది వెయ్యో మ్యాచ్ కాగా.. చరిత్రాత్మక వన్డేలో ఆ జట్టు భారీ తేడాతో గెలిచింది. 41 బంతుల్లోనే విజయాన్ని పూర్తి చేయడంతో ఆసీస్ 259 బంతులు మిగిలుండగానే గెలిచింది. ఆస్ట్రేలియాకు బంతులపరంగా ఇదే అతిపెద్ద విజయం. ఓవరాల్‌గా అంతర్జాతీయ క్రికెట్‌లో అతి స్వల్ప బంతులలో గెలిచిన జట్లలో ఆసీస్ ఆరోవది కావడం గమనర్హాం. ఈ జాబితాలో ఇంగ్లండ్ ప్రథమ స్థానంలో ఉంది .కెనడాపై జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్.. 277 బంతులు మిగిలుండగా (60 ఓవర్ల మ్యాచ్-1979లో) గెలుపొందగా తర్వాత శ్రీలంక.. జింబాబ్వేపై 274 బంతులు ఉండగా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ జాబితాలో నేపాల్ (యూఎస్ఎపై 268 బంతులు), న్యూజిలాండ్ (బంగ్లాదేశ్‌పై 264 బంతులు), భారత్ (శ్రీలంకపై 263 బంతులు) తర్వాత ఆసీస్ ఆరో స్థానంలో నిలిచింది.మ్యాచ్ విషయానికొస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన విండీస్, 24.1 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ అలిక్ అథనాజ్ 32 పరుగులతో టాప్ స్కోరర్ కాగా ఆ తర్వాత ఇద్దరు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు చేశారు. తొలి వన్డేలో నాలుగు వికెట్లు పడగొట్టిన ఆసీస్ యువ పేసర్ జేవియర్ బార్ట్‌లెట్.. ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగాడు. మూడో వన్డేలో జేవియర్.. 7.1 ఓవర్లు వేసి 21 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. లక్ష్యాన్ని ఆసీస్.. 6.5 ఓవర్లలోనే దంచికొట్టింది. ట్రావిస్ హెడ్ స్థానంలో ఓపెనర్‌గా వచ్చిన యువ ఓపెనర్ జేక్ ఫ్రేసర్.. 18 బంతుల్లోనే 5 బౌండరీలు, 3 సిక్సర్ల సాయంతో 41 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ జోష్ ఇంగ్లిస్.. 16 బంతుల్లోనే 4 బౌండరీలు, ఒక సిక్సర్‌తో 35 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వన్డే సిరీస్ ముగియడంతో విండీస్ ఆసీస్ మధ్య ఈనెల 9 నుంచి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ మొదలుకావాల్సి ఉంది.

# రోహిత్‌ను అందుకే తప్పించాం..

## పాండ్యాకు కెప్టెన్సీ సరైన నిర్ణయమే

### : ముంబై హెడ్‌కోచ్




ఐపీఎల్ 17వ సీజన్ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ మార్పు పెద్ద దుమారం రేపిన విషయం తెలిసిందే. ఐదు ట్రోఫీలు కట్టబెట్టిన రోహిత్ శర్మ కాదని హార్దిక్ పాండ్యా పగ్గాలు అప్పగించడాన్ని ముంబై ఫ్యాన్స్ జీర్ణించు కోలేక పోయారు. సోషల్ మీడియాలో వేలాది మంది ఫాలోవర్స్ ఆ ఫ్రాంఛైజీకి గుడ్ బై చెప్పారు. రోహిత్‌ను సారథగా తప్పించడంపై ముంబై హెడ్‌కోచ్ మార్క్ బౌచర్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు.'రోహిత్ రెండు సీజన్లు బ్యాటుతో పెద్దగా రాణించలేదు. కానీ కెప్టెన్‌గా మాత్రం ఆకట్టుకున్నాడు. అతడిలోని మునపటి ఆటగాడిని మేము చూడా లనుకుం టున్నాం. కెప్టెన్సీ భారం లేకుండా రోహిత్ స్వేచ్ఛగా ఆడాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంద'ని బౌచర్ తెలిపాడు.'సారథిగా రోహిత్‌పై ఉన్న ఒత్తిడిని తగ్గించాలనుకున్నాం. ముఖంపై నవ్వుతో బ్యాటింగ్ చేసే హిట్‌మ్యాన్‌ను చూడాలనేది మా అందరి లక్ష్యం. ఇక హార్దిక్ విషయానికొస్తే.. అతడు ముంబై ఆటగాడే. మరో ఫ్రాంచైజీకి వెళ్లి కెప్టెన్‌గా ట్రోఫీ గెలిచాడు. రెండో ఏడాది ఆ జట్టును రన్నరప్‌గా నిలిపాడు. అతడి నాయకత్వ లక్షణాలు అమోఘం. కెప్టెన్సీ మార్పు అనేది క్రికెట్ పరమైన నిర్ణయం. ఇకపై రోహిత్ స్వేచ్ఛగా ఆడొచ్చు. పరుగులు సాధించడంపై దృష్టి పెట్టవచ్చు' అని బౌచర్ తెలిపాడు. అయితే.. బౌచర్ వ్యాఖ్యల్ని రోహిత్ భార్య రితికా సజ్‌దేహ్ కొట్టిపారేసింది. బౌచర్ చెప్పినవ వాటిలో చాలా అబద్ధాలు ఉన్నాయని ఆమె ఆరోపించింది.ఐపీఎల్ ట్రోఫీతో రోహిత్ శర్మఐపీఎల్ టోర్నీలో ముంబై ఇండియన్స్ విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలవడం వెనక రోహిత్ శర్మ కృషి ఎనలేనిది. ఆటగాడిగా, కెప్టెన్‌గా రాణిస్తూనే ముంబైకి ఏకంగా ఐదు టైటిళ్లు అంది ంచాడు. అతడిసారథ్యంలోని ముంబై 2013, 2015, 2017, 2019తో పాటు 2020లో ఐపీఎల్ ట్రోఫీని అందుకుంది. అయితే.. 15వ సీజన్‌లో సమిష్టి వైఫల్యంతో నిరాశపరిచిన ముంబై.. 16వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరుకుంది. 15వ సీజన్‌లో హిట్‌మ్యాన్ 268 పరుగులతో నిరాశపరిచాడు. కానీ, 2023లో ఈ విధ్వంసక ఓపెనర్ దంచికొట్టాడు.

16 మ్యాచుల్లో 332 రన్స్ కొట్టి ముంబై ప్లే ఆఫ్స్ చేరడంలో కీలక పాత్ర పోషిం చాడు. ఐపీఎల్ 17వ సీజన్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుంది. వరల్డ్ కప్‌లో గాయపడిన పాండ్యా ఈ మధ్యే కోలుకొని ఫిట్ నెస్‌పై దృష్టి పెట్టాడు. బరో డా మైదానంలో బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియో విడుదల చేశాడు. దాంతో, ఐపీఎల్ 2024 ఎడిషన్‌లో అతడు ముంబై కెప్టెన్‌గా బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది.

# విజయ్ బాటలో విశాల్..
# త్వరలో రాజకీయ పార్టీ ప్రకటన..?

తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ రాజకీయ ( రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. 'తమిళ వెట్రి కళగం' పేరిట పార్టీని ప్రకటించారు. అయితే తన పార్టీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, అదేవిధంగా ఏ పార్టీకి మా పార్టీ మద్దతివ్వట్లేదని విజయ్ తెలిపాడు. ఈ నేపథ్యంలో విజయ్ బాటలోనే తాజాగా మరో హీరో తమిళనాడు (%ఝఎఅశ్రీ ఛీుఎబ%) రాజకీయాల్లోకి వస్తున్నారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.ప్రముఖ నటుడు విశాల్ త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ తమిళనాట టాక్ నడుస్తోంది. పార్టీ ఏర్పాటుకు విశాల్ సన్నాహాలు మొదలు పెట్టినట్లు సమాచారం. పార్టీ ఏర్పాటుకు గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2026 అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా రాజకీయ ఎంట్రీ ఉండబో తోందని జోరుగా ప్రచారం జరుగుతోంది. విశాల్ పొలిటికల్ ఎంట్రీపై త్వరలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తమిళనాట టాక్ వినిపిస్తోంది.

అతి త్వరలోనే ఆయన తన పార్టీ పేరును కూడా ప్రకటించబోతున్నారని సమాచారం.కాగా, తమిళనాడు రాజకీయాలపై విశాల్ చాలా ఏళ్లుగా ఆసక్తిగా ఉన్నారు. గతంలో చెన్నై ఆర్కే నగర్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు విశాల్ నామినేషన్ కూడా వేశారు. అయితే, కొన్ని కారణాల రీత్యా ఆ నామినేషన్ తిరస్కరణకు గురైంది. విశాల్ ప్రస్తుతం 'విశాల్ పీపుల్స్ హెల్త్ మూమెంట్' పేరుతో ప్రజలకు సేవ చేస్తున్న విషయం తెలిసిందే. చెన్నైలో వరదలు ఇతర విపత్తు సమయంలో ప్రజలను ఆదుకుంటున్నారు. అయితే, గతంలో ఓ సారి విశాల్ మాట్లాడుతూ.. 'నేను రాజకీయాల్లోకి రావడం ఖాయం. అయితే నా రాజకీయ ప్రవేశం ఎప్పుడన్నది ఇప్పుడే



చెప్పలేను. సమాజసేవ చేసేందుకే రాజకీయాల్లోకి అడుగు పెడతా' అని విశాల్ స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఆయన పొలిటికల్ ఎంట్రీ ఖాయంగా తెలుస్తోంది.



# 25 రోజుల్లో 300 కోట్లు..
# సరికొత్త రికార్డు సృష్టించిన హనుమాన్

తేజ సజ్జా ప్రధాన పాత్రలో నటించిన హనుమాన్ సినిమా సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన ఈ చిత్రం ఇప్పటికీ వారాంతాల్లో హౌస్‌ఫుల్ కలెక్షన్లు రాబడుతున్నది. దీంతో విడుదలైన 25 రోజుల్లో రూ.300 కోట్లు వసూలు చేసింది. దీంతో ఈ ఏడాదిలో రూ.300 కోట్లు సాధించిన మొదటి సినిమాగా నిలిచింది. దీనిపై డైరెక్టర్ ప్రశాంత్ వర్మ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. హనుమాన్‌ను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో అర్థకావట్లేదని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ సినిమాకు ఎంతోమంది వారి హృదయాల్లో స్థానం కల్పించారని, ఒక్కసారి కంటే ఎక్కువ సార్లు దీని వీక్షిస్తున్నారని చెప్పారు. ఈ సినిమాను ఆదరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

సంక్రాంతి బరిలో నిలిచిన ఈ సినిమా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. థియేటర్లు తక్కువగా ఉన్నప్పటికీ హిట్‌టాక్ రావడంతో క్రమంగా స్క్రీన్‌ల సంక్ష పెంచుకున్నది. మూడు వారాలు ముగిసినప్పటికీ ప్రేక్షకులు ఇంకా ఆదరిస్తునే ఉన్నారు. దీంతో సంక్రాంతి సీజన్‌లో రిలీజైన సినిమాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. 92 ఏండ్ల టాలీవుడ్ ప్రస్థానంలో ఆల్‌టైమ్ సంక్రాతి బ్లాబస్టర్‌గా రికార్డు సృష్టించింది.




## అది మరచిపోలేని అనుభూతి..
### అలాంటి పాత్రలు చాలా అరుదు



: సాయిపల్లవి

'కమల్‌హాసన్‌సార్ నా ఫేవరెట్ యాక్టర్. 'మహానది' సినిమా అంటే నాకు పిచ్చి. ఎన్నిసార్లు చూశానో లేక్కలేదు. కమల్ సార్‌ని చూస్తే చాలు అనుకునేదాన్ని. ఇప్పుడు ఆయన ప్రొడక్షన్‌లో నటిస్తున్నాను. ఆయనతో ఇప్పటివరకూ నటించే అవకాశం రానందుకు బాధగా ఉంది' అంటున్నది అందాలతార సాయిపల్లవి. ఆమె ప్రస్తుతం శివకార్తికేయన్ 'ఎస్‌కే 21'లో కథానాయికగా నటిస్తున్నది. ఆర్.మహేంద్రన్, వివేక్ కృష్ణానిలతో కలిసి కమల్ హాసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ సినిమా గురించి ఇటీవల మీడియాతో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది సాయిపల్లవి. ' ఈ సినిమా షూటింగ్ టైమ్‌లో కమల్‌సార్‌ని కలిశాను. ఆయన నవ్వుతూ పలకరించిన తీరు జీవితంలో మరిచిపోలేను. అదొక మెమరబుల్ ఎక్స్పరియన్స్. ఇక ఇందులోని నా పాత్ర విషయానికొస్తే.. ప్రేయసిగా, భార్యగా, ఓ బిడ్డకు తల్లిగా రకరకాల పార్శ్వాలతో కూడుకున్న పాత్ర నాది. అరుదుగా మాత్రమే ఇలాంటి పాత్రలు దొరుకు తుంటాయి. తమిళంతోపాటు తెలుగులో కూడా ఓకేసారి విడుదలవుతుందీ సినిమా. అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను' అని చెప్పింది సాయిపల్లవి. ఇదిలావుంటే.. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో రూపొం దుతోన్న ఈ చిత్రంలోని కథా నాయిక పాత్ర కోసం చాలామంది హీరో యిన్లు ప్రయత్నించారని సమాచారం.

# మొయిద్దీన్ భాయ్‌గా రజినీకాంత్..
## రిలీజైన లాల్ సలామ్ ట్రైలర్

**చెన్నై:** సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించిన లాల్ సలామ్ చిత్రానికి చెందిన తమిళ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. విష్ణు విశాల్, విక్రాంత్ ఈ ఫిల్మ్‌లో హీరో పాత్రలను పోషిస్తున్నారు. తలైవా రజినీకాంత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. రజినీ కూతురు ఐశ్వర్య రజినీకాంత్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. ఫిబ్రవరి 9వ తేదీన ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ అవుతోంది. స్పోర్ట్స్ కథాంశంతో తీసిన ఈ చిత్రాన్ని వాస్తవానికి పొంగల్



పండుగకు రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ కొన్ని కారణాల వల్ల విడుదల వాయిదావేశారు.మతం, రాజకీయం, క్రికెట్ డ్రామాతో ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ ఫిల్మ్‌లో విక్రాంత్, విష్ణు విశాల్ క్రికెటర్లు. ట్రైలర్‌లో ఓ దశలో లెజెండరీ క్రికెటర్ కపిల్‌దేవ్ కూడా కనిపిస్తారు. లైకా ప్రొడక్షన్ ఈ చిత్రాన్ని నిర్మించింది. సుభాస్కరన్ దీన్ని ప్రజెంట్ చేశారు. మొయిద్దీన్ భాయ్ పాత్రలో రజినీకాంత్ నటిస్తున్నారు.

# వరుణ్ తేజ్ ఆపరేషన్ వాలెంటైన్
## నుంచి గగనాల మెలోడీ సాంగ్




టాలీవుడ్ హీరో వరుణ్ తేజ్ వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి ఆపరేషన్ వాలెంటైన్ పాన్ ఇండియా కథాంశంతో వార్ డ్రామా నేపథ్యంలో 13గా వస్తోంది. శక్తి ప్రతాప్ సింగ్ హడ డైరెక్షన్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (భారత వైమానిక దళం)కు డెడికేట్ చేస్తూ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాజీ మిస్ యూనివర్స్ మానుషి చిల్లర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఫైటర్ పైలట్‌గా నటిస్తుండగా.. మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపించనుంది.ఇప్పటికే వందేమాతరం పాటను అమృత్‌సర్‌లోని చారిత్రక వాఘా సరిహద్దులో లాంఛ్ చేశారని తెలిసిందే. మిక్కీ జే మేయర్ కంపోజిషన్‌లో వచ్చే గగనాల లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. హీరోహీరోయిన్ల మధ్య ట్రాక్ నేపథ్యంలో సాగుతున్న ఈ మెలోడీ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. యాడ్ ఫిల్మ్ మేకర్, సినిమాటోగ్రఫర్, వీఎఫ్‌ఎక్స్ స్పెషలిస్ట్ శక్తి ప్రతాప్ సింగ్ హడ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెలుగు, హిందీ బై లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ మూవీ టీజర్‌ను ఇప్ఫటికే లాంఛ్ చేయగా.. మంచి స్పందన వస్తోంది. మన ఎయిర్‌ఫోర్స్‌ను ఇంకో దేశ ంలోకి పంపించడమంటే.. యుద్ధాన్ని ప్రకటించడమే.. అంటూ సాగుతున్న టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న 2024 గ్రాండ్‌గా విడు దల చేయనున్నట్టు ప్రకటించారు.ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్-రెనాయ్‌సెన్స్ పిక్చర్స్ బ్యానర్లపై సందీప్ ముద్ద, నందకుమార్ అబ్బినేని తెరకె క్కిస్తున్నారు. వరుణ్ తేజ్ దీంతోపాటు పలాస 1978 ఫేం కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ మట్కా కూడా చేస్తున్నాడు.

# ఏపీలో పోటీపడుతున్న రాజకీయ సినిమాలు..
# పై చేయి ఎవరిదో..!




ఎన్నికల సీజన్ వచ్చిందంటే చాలు.. పొలిటికల్ లీడర్స్ కంటే దర్శక నిర్మాతలే ఎక్కువగా పండగ చేసుకుంటారు. ఎందుకంటే ఎలక్షన్ సీజన్ వాడుకొని పొలిటికల్ సినిమాలు చేసే దర్శకులు ఎక్కువగా ఉంటారు. వాటిని క్యాష్ చేసుకోవాలని చూసే నిర్మాతలు ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారు. కొందరు కొన్ని పార్టీలకు అనుకూలంగా సినిమాలు తీస్తూ ఉంటారు. ఇప్పుడు కూడా ఇదే జరుగుతుంది. మొన్న తెలంగాణ ఎలక్షన్స్ సమయంలో ఎక్కువగా అలాంటి సినిమాలు మన దగ్గర రాలేదు. కానీ ఏపీలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వచ్చే ఎలక్షన్స్‌ను క్యాష్ చేసుకోవడానికి ఇప్పటి నుంచి పొలిటికల్ సినిమాలు రెడీ చేస్తున్నారు దర్శక నిర్మాతలు. ఈ నేపథ్యంలో అందరి కంటే ముందు యాత్ర 2 సినిమా రానుంది.2019 ఎలక్షన్స్ కు ముందు మహి వి రాఘవ తెరకెక్కించిన యాత్ర సినిమా మంచి విజయం సాధించింది. 2003 సమయంలో రాజశేఖర్ రెడ్డి చేసిన పాదయాత్ర నేపథ్యంలో ఈ సినిమా వచ్చింది. వైసీపీ విజయానికి ఎంతో కొంత యాత్ర కూడా బాగానే ఉపయోగపడింది. ఇక ఇప్పుడు యాత్ర 2 సినిమాతో వసు_న్నాడు మహి వీ రాఘవ్. ఇందులో జగన్ చేసిన పాదయాత్ర గురించి ఎక్కువగా హైలెట్ చేస్తున్నాడు. అయితే యాత్రను ఎవరిని కించప రచకుండా కేవలం ఎమోషనల్ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కించిన మహి.. దాని సీక్వెల్ మాత్రం వన్ సైడ్‌గా రూపొందించాడనే విమర్శలు ఎదు ర్కొంటున్నాడు. జగన్ కోసమే ఈ సినిమా తీశారని అందులో ఆయనను హీరో చేయడం కోసం మిగిలిన వాళ్లను విలన్లుగా చూపి స్తున్నారు అనే విమర్శలు ఇప్పటికే మొదలయ్యాయి. ఫిబ్రవరి 8న ఈ సినిమా విడుదల కానుంది.ఇదిలా ఉంటే టీడీపీకి అనుకూలంగా రాజధాని ఫైల్స్ అంటూ ఒక సినిమా వస్తుంది. ఏపీలో రాజధాని ఇష్యూపై మూడు నాలుగు సంవత్సరాలుగా రగడ నడుస్తూనే ఉంది. దీన్ని హైలైట్ చేస్తూ రాజధాని ఫైల్స్ అనే సినిమా తీసుకొస్తున్నారు. ఇది కూడా త్వరలోనే విడుదల కానుంది. ఈ రెండు సినిమాలు కాకుండా వర్మ వ్యూహం ఎలాగూ ఉంది.

**Owner, Editor, Printed & Published :** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District -500098. Telangana. Printed at S.A Printers,D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District -500098, Telangana, **RNI Title Code: TELTEL12270**, Cell: 8125972476. website : quicktodaynews@gmail.com, e-mail : gbuchireddy79@gmail.com